అమల్లోకి.. అమృత్ 2.0


(నరసరావుపేట మున్సిపాల్టీలో ఐదేళ్లుగా నిర్మాణంలో ఓవర్‌హెడ్ ట్యాంక్

అమృత్ పనులకు వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టిన గ్రహణం వీడింది. అమృత్ 2.0తో తిరిగి అమృత్ లక్ష్యాలను సాధించనున్నారు. గత వైసీపీ పాలనలో మున్సిపాల్టీల్లో ఎక్కడికక్కడ నిలిచిపోయిన అమృత్ పనులు తిరిగి పట్టాలెక్కనున్నాయి. గతంలో కేంద్ర ప్రభుత్వం పురపాలక సంఘాల్లోని ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు, మెరుగైన మురుగునీటి పారుదల వ్యవస్థలను అందించాలని లక్ష్యంగా అమృత్ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే వైసీపీ హయాంలో నిధుల లేమితో పనులు పూర్తి కాలేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమృత్ పథకంపై సమీక్షించింది. గతంలో నిలిచిపోయిన పనుల పూర్తి చేయడంతో పాటు ఆయా గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని మున్సిపాలిటీల్లో తాగునీటి పథకాలు, బలహీనవర్గాల కాలనీల్లో ఇళ్లకు కుళాయి కనెక్షన్లు, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించింది. వీటికి కేంద్రం నుంచి ఆమోదం రావడంతో మున్సిపాలిటీలకు మహర్దశ పట్టింది. త్వరలో ఆయా పనులు ప్రారంభించనున్నట్లు సమాచారం.

- గ్రహణం వీడి.. మున్సిపాల్టీలకు మహర్దశ
- తాగునీరు, పారిశుధ్యం మెరుగునకు ప్రణాళికలు
- బలహీనవర్గాల కాలనీల్లో నీటి సరఫరాకు ప్రాధాన్యం
- వైసీపీ హయాంలో నిలిచిన పనుల పూర్తికి చర్యలు
- పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలకు రూ.513.58 కోట్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పుర ప్రజల తాగునీటి, మురుగునీటి సమస్యలు పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్ పథకం తిరిగి పట్టాలెక్కనున్నది. అమృత్ పథకానికి వైసీపీ హయాంలో పట్టిన గ్రహణం వీడనున్నది. అమృత్ పనులను తిరిగి ప్రారంభించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. తాగునీరు, పారిశుధ్యం మెరుగుదలతో ప్రజలకు మెరుగైన ఆరోగ్యం కల్పించాలన్న అమృత్ పథకం లక్ష్యానికి అనుగుణంగా ప్రతిపాదనలను తయారు చేశారు. అమృత్ 2.0 పథకం కింద పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాల్టీలలో రూ.513.58 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. మురుగునీటిశుద్ధి ప్లాంట్లు, నీటి సరఫరా కోసం ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, తాగునీటి సరఫరాకు పైపులైన్లు, తాగునీటి నిల్వ చెరువుల అభివృద్ధి, పేదల గృహాలకు కుళాయి కనెక్షన్లు తదితర పనులు చేపట్టనున్నారు. ప్రతి మున్సిపాల్టీలో మురుగునీటిని శుద్ధి చేసి ఆ నీటిని ఇతర అవసరాలకు వినియోగించాలన్నది అమృత్ ప్రధాన లక్ష్యం. అమృత్ పనులు పూర్తయితే పట్టణాల్లో తాగునీరు, మురుగు నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనున్నది.

అమృత్ తొలివిడత పనులు ఇలా..

చిలకలూరిపేట, నరసరావుపేట, తెనాలి మున్సిపాల్టీల్లో అమృత్ తొలివిడత కింద 2015, 2016 ఆర్థిక సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో ఆయా మున్సిపాలిటీలలో రక్షిత మంచి నీటి పథకాల విస్తరణ, మురుగునీటి వ్యవస్థ అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ పనులు ఇంకా పూర్తి కాలేదు. నరసరావుపేటలో రూ.13.53 కోట్లతో తాగునీటి పథకం పనులు చేపట్టగా రూ.5.08 కోట్లతో పైపులైన్ నిర్మాణాన్ని పూర్తి చేశారు. తాగునీటి కుళాయిలు, నీటి సరఫరా పైపులైన్, ఓవర్ హెడ్ ట్యాంకు పనులు సాగదీస్తునే ఉన్నారు. తెనాలిలో రూ.9.09 కోట్లతో చేపట్టిన పనులు ఇంకా పూర్తి కాలేదు. 24,329 కుళాయి కనెక్షన్లు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 10,873 కనెక్షన్లు మాత్రమే ఇచ్చారు. నీటి పంపిణీ పైపులైన్ల పనులు పూర్తయాయి. చిలకలూరిపేటలో రూ.149.92 కోట్ల పనులు చేపట్టగా నిధుల కొరతతో చాలావరకు పనులు నిలిచిపోయాయి. రూ.7.70 కోట్లతో 4975 కుళాయి కనెక్షన్లు ఇవ్వాలన్న లక్ష్యం నెరవెరలేదు. పంపింగ్ మెయిన్, డిస్ట్రిబ్యూషన్ పైపులైన్లు, తదితర తాగునీటి పథకం పనులు పూర్తి చేయలేక పోయారు. రూ.132.11 కోట్లతో సాగర్ ప్రధాన కాల్వ నుంచి పట్టణానికి నీటి సరఫరాకు పైపులైన్ నిర్మాణాన్ని చేపట్టగా అవి 37 శాతమే పూర్తయ్యాయి. తాగునీటి విస్తరణ పనులు అర్థాంతరంగా నిలిచిపోవడంతో చిలకలూరిపేట ప్రజలు నీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. మురుగునీటి వ్యవస్థ అభివృద్ధిలో భాగంగా రూ.10.10 కోట్లతో 5 ఎంఎల్‌డీ సామర్థ్యంతో చేపట్టిన ఎస్‌టీపీ పనులు కూడా నిలిచిపోయాయి. మున్సిపల్ వాటా చెల్లించే పరిస్థితి లేకపోవడంతో మున్సిపల్ ఆస్తులు తనఖా పెట్టి రూ.43 కోట్లు ఏపీయూఎఫ్ఐడీసీ నుంచి రుణం తీసుకున్నారు.

పల్నాడులో రూ.275.55 కోట్లతో పనులు

పల్నాడు జిల్లాలోని మున్సిపాల్టీల్లో రూ.182.42 కోట్ల వ్యయంతో తాగు నీటి పథకాల విస్తరణ, రూ.93.13 కోట్లతో మురుగునీటి వ్యవస్థ అభివృద్ధి చేసేందుకు అంచనాలను రూపొందించారు. గురజాల నగర పంచాయతీలో రూ.28.28 కోట్లతో తాగునీటి పథకాన్ని విస్తరించనున్నారు. మాచర్ల మున్సిపాల్టీలో రూ.32.30 కోట్లతో తాగు నీటి పథకం అభివృద్ధి చేయనున్నారు. పిడుగురాళ్ల మున్సిపాల్టీలో రూ.20.96 కోట్లు, దాచేపల్లి నగర పంచాయతీలో రూ.24.08 కోట్లు, వినుకొండ మున్సిపాల్టీలో 25.80 కోట్లు, చిలకలూరిపేట మున్సిపాల్టీలో రూ.37.40 కో ట్ల వ్యయంతో తాగునీటి పథకాల అభివృద్ధికి ప్రణా ళికలు సిద్ధం చేశారు. చిలకలూరిపేట మున్సిపాల్టీ లో మురుగునీటి సమస్యల పరిష్కారానికి రూ.69.53 కోట్లతో మురుగునీటి శుద్ధిప్లాంట్ నిర్మిం చాలని నిర్ణయించారు. రూ.23.60 కోట్లతో నరసరావు పేటలో ప్రస్తుతం అమల్లో ఉన్న భూగర్భ డ్రెయినేజి పథకం విస్తరణకు ప్రణాళిక సిద్ధం చేశారు.

గుంటూరు జిల్లాకు రూ.157.95 కోట్లు

గుంటూరు జిల్లా పరిధిలోని గుంటూరు నగర పాలక సంస్థ, పొన్నూరు, తెనాలి మున్సిపాలిటీలకు 157.95 కోట్లతో అమృత్ 2.0 పనులు చేయనున్నారు. తాగునీటి పథకాల అభివృద్ధి రూ.47.14 కోట్లు, మురుగునీటి సమస్యల పరిష్కారానికి రూ.110.81 కోట్లు వెచ్చించేందుకు ప్రణాళికలు రూపొందించారు. గుంటూరు కార్పొరేషన్‌లో రూ.27.21 కోట్ల వ్యయంతో బలహీన వర్గాల కాలనీలకు తాగునీటి పథకాన్ని విస్తరించనున్నారు. పొన్నూరు పురపాలక సంఘంలో రూ.9.90 కోట్లతో తాగునీటి పథకం విస్తరణ, రూ.7.80 కోట్లతో బలహీన వర్గాల కాలనీలకు తాగునీటి వసతి కల్పించనున్నారు. తెనాలిలో రూ.2.23 కోట్లతో పేదల ఇళ్లకు కళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. మురుగునీటి వ్యవస్థ అభివృద్ధిలో భాగంగా మురుగునీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణానికి రూ.35.10 కోట్లతో అంచనాలు తయారు చేశారు.

బాపట్ల జిల్లాలో రూ.80.08 కోట్లు వ్యయం

బాపట్ల జిల్లాలో నాలుగు మున్సిపాల్టీలకు రూ.80.08 కోట్లు కేటాయించారు. అద్దంకి మున్సిపాల్టీలో బలహీన వర్గాలు నివసించే కాలనీలకు తాగునీటి సరఫరా వ్యవస్థ అభివృద్ధికి రూ.4.82 కోట్లు కేటాయించారు. తాగునీటి పథకాలకి చీరాలకు రూ.23.82 కోట్లు, బాపట్లకు రూ.15 కోట్లు కేటాయించారు. రూ.5.24 కోట్లతో బాపట్లలోని బలహీనవర్గాల కాలనీలకు తాగునీటిని సరఫరా చేయనున్నారు. రేపల్లెలో రక్షిత మంచినీటి పథకం అభివృద్ధికి రూ.26.46 కోట్లు, బలహీన వర్గాలకాలనీల్లో తాగునీటి వసతికి రూ.4.74 కోట్ల వ్యయం చేయనున్నారు.

ఆనందాల కేళి.. దీపావళి




వెలుగుల జిలుగులు.. దీపాలంకరణలతో నిండిన లోగిళ్లు.. టపాకాయల మోతలతో దద్దరిల్లిన పరిసరాలు.. చిన్నా పెద్ద కేరింతలు.. దీపావళి ఆనందాల కేళిగా హోరెత్తింది. శుక్రవారం పల్లెపట్టణం అన్న తేడా లేకుండా దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. వ్యాపారులు తమ దుకాణాలను పూలతో తీర్చిదిద్ది ప్రత్యేకపూజలు చేశారు. సాయంత్రం ఆరు గంటల నుంచి అర్ధరాత్రి వరకు టపాసుల మోతలు మిన్నంటాయి.

- నరసరావుపేట

ధరల నియంత్రణకు.. కమిటీ

- నిర్వీర్యమైపోయిన కమిటీల పునరుజ్జీవం
- చైర్‌పర్సన్‌గా కలెక్టర్, మరో 16 మంది నియామకం
- నూతన విధివిధానాలను ఖరారు చేసిన ప్రభుత్వం
- మొక్కుబడి సమావేశాలు కాకుండా ధరల పర్యవేక్షణకు ఆదేశాలు

గుంటూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ధరల పర్యవేక్షణ, నియంత్రణ, మార్కెట్ ఇంటర్‌వెన్షన్ జిల్లా కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కొన్నేళ్ల నుంచి నిర్వీర్యమైపోయిన ధరల నియంత్రణ కమిటీకి పునరుజ్జీవం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే నూతన కమిటీని నియమించి విధివిధానాలను ఖరారు చేసింది. కమిటీకి కలెక్టర్ చైర్‌పర్సన్‌గా నియమించింది. వైస్‌చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్, కన్వీనర్‌గా జిల్లా పౌరసరఫరాల అధికారి, సభ్యులుగా వ్యవసాయాధికారి, ఉద్యాన జేడీ/డీడీ, రైతుబజార్ల ఎస్టేట్ అధికారి, వాణిజ్యపన్నుల శాఖ అధికారి, మార్కెటింగ్ డీడీ/ఏడీ, లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, వంటనూనెల మర్చంట్స్, పప్పు మిల్లుల సంఘాల అధ్యక్షులు, రైతు సంఘాలు, రైస్‌మిల్లర్లు, హోల్‌సేల్ తిండి గింజల వ్యాపారుల నుంచి ఒక్కొక్కరిని నియమించాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. వీరితో పాటు రిటైలర్స్ నుంచి ఒకరు, పరిస్థితిని బట్టి ఇతర సరుకులు విక్రయించే వ్యాపారుల నుంచి ఒకరిని నియమించుకోవాలని సూచించింది. ఇటీవల కాలంలో తరచుగా నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రస్తుతం వంటనూనెల ధర లీటర్‌కు రూ.25కి పైగా పెరిగింది. ఉల్లిపాయలు కేజీ రూ.60 వద్ద కొనసాగుతున్నాయి. వెల్లుల్లి ధర కేజీ రూ.300 పైమాటే. కందిపప్పు రూ.150కి పైగా ఉన్నది. బియ్యం ధరలు కేజీ రూ.50 నుంచి రూ.65 వరకు ఉన్నాయి. ఇకపై మొక్కుబడిగా మూడు, నాలుగు నెలలకు సమావేశాలు నిర్వహణకు పరిమితం కాకుండా నిత్యవసర సరుకుల ధరలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించింది. ధరల పరిస్థితి, మార్కెట్‌లో సరుకుల లభ్యతపై ప్రతీ వారం సమీక్షించాలని సూచించింది. ఏదైనా సరుకు ధర పెరిగితే అందుకు దారి తీస్తున్న కారణాలను విశ్లేషించాలి. ఆ వెంటనే ధరలను తగ్గించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. సరుకుల బ్లాక్‌మార్కెటింగ్, నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టించడం వంటి చర్యలను అరికట్టాలి. ధరల స్థిరీకరణ ప్రణాళిక రూపొందించి ఎగ్జిక్యూటివ్ కమిటీకి నివేదించాలి. కాగా ప్రణాళికా శాఖ మండల స్థాయిలో కొన్ని ఎంపిక చేసిన సరుకుల ధరలను సేకరించి కన్స్యూమర్ ప్రైస్ మొబైల్ అప్లికేషన్(సీపీ యాప్)లో అప్‌లోడింగ్ చేయాలి. అలానే రైతుబజార్ల ఎస్టేట్ అధికారి కూరగాయల ధరలను ఇదే యాప్‌లో అప్‌లోడింగ్ చేయాలని ప్రభుత్వం సూచించింది.

అర్హులందరికీ దీపం-2

- రూ.163 కోట్లతో ఉచితంగా గ్యాస్ సిలెండర్లు
- పిడుగురాళ్లలో పథకాన్ని ప్రారంభించిన కలెక్టర్ అరుణ్‌బాబు


పిడుగురాళ్లలో మహిళలకు దీపం పథకం సిలిండర్లను అందిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తదితరులు

పిడుగురాళ్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దీపం పథకం -2లో అర్హులైన ప్రతి కుటుంబానికి ఉచితంగా గ్యాస్ సిలిండర్‌ను అందజేస్తామని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. పిడుగురాళ్లలో ఉచిత గ్యాస్ పంపిణీ పథకాన్ని కలెక్టర్ శుక్రవారం ప్రారంభించి ప్రసంగించారు. రూ.163 కోట్లతో జిల్లాలో దీపం పథకాన్ని అమలు చేస్తుండగా ఇందులో ఎక్కువ గ్యాస్ సిలిండర్లు గురజాల నియోజక వర్గంలో అందజేయనున్నట్లు చెప్పారు. గ్యాస్ సరఫరాలో ఏమైనా ఇబ్బందులుంటే 1967 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయాలన్నారు. గురజాల నియోజక వర్గంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే యరపతినేని ఒక సిలిండర్‌ను ఉచితంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. మొదటి రోజే పింఛన్ పంపిణీ 98 శాతం పూర్తిచేశామని, వచ్చే నెలలో అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. 1995లో డ్వాక్రా గ్రూపులను స్థాపించి మహిళా శక్తికి చంద్రబాబు కృషి చేశారని, ఇప్పుడు సూపర్ సిక్స్ పథకంలో ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు సిలిండర్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్లలో ప్రతి కుటుంబానికి ఒక సిలిండర్ అందిస్తానని ఎన్నికల ప్రచారంలో తానిచ్చిన మాటను సంక్రాంతి తర్వాత శ్రీకారం చుడతానని చెప్పారు. వచ్చే ఏడాది గ్రామీణ ప్రాంతాల్లో లింకురోడ్లను ఏర్పాటు చేస్తామన్నారు. వైసీపీ నియంతృత్వ ధోరణితో రాష్ట్రం విలవిలలాడిపోయిందని యరపతినేని గుర్తుచేశారు. 2014-19 మధ్యకాలంలో గురజాల నియోజకవర్గంలో అరాచకమే తప్ప అభివృద్ధి లేదన్నారు. వైసీపీ పాలనలో 11 వేల కోట్లు అప్పులు తీసుకొచ్చి రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేశారని, చంద్రబాబు రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. తల్లికి, చెల్లికి న్యాయం చేయలేని వారికి ప్రజల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ చంద్రబాబు ఈ సారి కూడా ముఖ్యమంత్రి కాకుంటే రాష్ట్రం పదింతల వెనక్కి వెళ్లే పరిస్థితి వచ్చేదన్నారు. లక్షల కోట్లు అప్పులు తెచ్చిన జగన్ రాష్ట్రానికి ఒరగపెట్టింది ఏమీలేదని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వాన్ని, పాలనను గాడిలో పెడుతున్నారన్నారు. సభలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకటసుబ్బారావు, ఇన్‌చార్జ్ డీఆర్వో నారదముని, ఆర్డీవో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట టీడీపీలో కోడెల విగ్రహం చిచ్చు


తొలగించిన కోడెల విగ్రహం

- నానాటికి ముదురుతున్న వివాదం
- తొలగించిన చోటే విగ్రహం ఏర్పాటు చేయాలన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- విగ్రహం తొలగింపుపై అధిష్ఠానం ఆరా
- అధికారులను తప్పుపడుతున్న ఎమ్మెల్యే అరవిందబాబు వర్గం

6

రెస్టారెంట్‌పై రౌడీషీటర్ దాడి

- ఎమ్మెల్యేతో మాట్లాడండి.. లేకుంటే వ్యాపారం జరగదు
- బార్ నిర్వాహకులను హెచ్చరించిన దుండగులు
- తనకు ఏ సంబంధం లేదన్న ఎమ్మెల్యే అరవిందబాబు
- పోలీసులకు ఫిర్యాదు.. ఎట్టకేలకు అరెస్టు

ఇద్దరు ఇంజనీర్లపై వేటు

- విధుల్లో నిర్లక్ష్యంపై మున్సిపల్‌శాఖ చర్యలు
- పిడుగురాళ్ల డీఈ, మాచర్ల ఏఈల సస్పెన్షన్

నరసరావుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు ఇంజనీర్లపై వేటు పడింది. పిడుగురాళ్ల మున్సిపల్ డీఈ వీ శ్రీనివాసరావు, మాచర్ల మున్సిపల్ ఏఈ టీ రాఘవేంద్రరావులను సస్పెండ్ చేస్తూ పబ్లిక్ హెల్త్ ఈఎన్‌సీ మరియన్న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కమిషనర్లకు ఉత్తర్వులు అందాయి. దాచేపల్లిలో అతిసార లక్షణాలతో ఇద్దరు మృతి నేపథ్యంలో పనుల పర్యవేక్షణకు డీఈ శ్రీనివాసరావు, ఏఈ రాఘవేంద్రరావులను నియమిస్తూ గత నెల 25న ఉత్తర్వులు ఇచ్చారు. అయితే సదరు ఇంజనీర్లు వారికి కేటాయించిన విధులను 30వ తేదీ వరకు చేపట్టలేదు. దీనిని ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణించి వారిపై వేటు వేశారు. పిడుగురాళ్ల డీఈగా ఉన్న శ్రీనివాసరావు దాచేపల్లి, గురజాల నగరపంచాయతీలకు ఇన్‌చార్జి డీఈ, గురజాల నగరపంచాయతీకి కమిషనర్ (ఎఫ్ఏసీ)గా ఉన్నారు. ఆయన సస్పెండ్‌తో ఆయా పోస్టులకు ఇన్‌చార్జిలను నియమించారు. మాచర్ల ఏఈ, దాచేపల్లి ఏఈ పోస్టులకు కూడా ఇన్‌చార్జిలను నియమించారు.

నాడు పెద్దపీట.. నేడు సస్పెన్షన్

వైసీపీతో అంటకాగిన డీఈ శ్రీనివాసరావుకు కూటమి ప్రభుత్వంలో ప్రాధాన్యం ఇచ్చారు. నరసరావుపేట మున్సిపాల్టీలో డీఈగా ఉన్న శ్రీనివాసరావును పిడుగురాళ్ల మున్సిపాల్టీకి బదిలీ చేశారు. ఈ పోస్టుతో పాటు దాచేపల్లి నగర పంచాయతీకి ఇన్‌చార్జి డీఈగా, గురజాల నగరపంచాయతీకి ఇన్‌చార్జి కమిషనర్‌గా నియమించి పెద్దపీట వేశారు. నరసరావుపేట మున్సిపాల్టీని వైసీపీ జేబు సంస్థగా మార్చడంతో సదరు అధికారి కీలక పాత్ర పోషించారన్న ఆరోపణలున్నాయి. తన మాట వినని ఆరుగురు కమిషనర్లు, ఆరుగురు మున్సిపల్ ఇంజనీర్లను బదిలీ చేయించారని మున్సిపల్ వర్గాలు బహిరంగానే చెబుతున్నాయి. నాటి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి డీఈ శ్రీనివాసరావు చెప్పిందే మున్సిపాల్టీలో అమలు చేశారన్న ఆరోపణలున్నాయి. వైసీపీ నేతలు, గోపిరెడ్డి అండతో ఆయన ఇష్టారాజ్యంగా వ్యవహరించారని టీడీపీ నేతలు చెబుతున్నారు. దాచేపల్లి ఘటనలో ఆయనపై చర్యలు తీసుకోవడం నరసరావుపేట మున్సిపాల్టీ కార్యాలయవర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. వైసీపీ హయాంలో వేధింపులకు గురైన అధికారులు ప్రస్తుత చర్యలపై సంతోషం వ్యక్తం చేస్తున్నారని కార్యాలయ వర్గాలు తెలిపాయి.

జంగాకు టీటీడీ బోర్డు పదవి అభినందనీయం


మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిని అభినందిస్తున్న టీడీపీ నాయకులు

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబరుగా నియమితుడైన మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి యాదవ్‌ని అఖిల భారత యాదవ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. శుక్రవారం గుంటూరులోని ఆయన నివాసానికి వచ్చిన అఖిల భారత జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు తాళ్ల నాగరాజు యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జంగాకు సీఎం చంద్రబాబు నాయుడు పదవిని ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో తిరుమల తిరుపతి దేవస్థానంలో యాదవులకు సముచిత స్థానం కల్పించాలని, అలాగే శరభయ్య యాదవ్ విగ్రహాన్ని తిరుపతిలో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పుటూరు పేరయ్య యాదవ్, మద్దుల వెంకట కోటయ్య, పెద్దిబోయిన బాలయ్య యాదవ్, కొండేపి శేఖర్ యాదవ్, అలా గంగారావు, చావలి గోపి, తొలుసూరి శివ గండు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికపై బాబాయ్ అత్యాచారం

● గర్భం దాల్చిన బాలిక

పెదకాకాని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సొంత బాబాయ్ మానవత్వాన్ని మరిచాడు. తన అన్న కుమార్తె అన్న విచక్షణ లేకుండా కామాంధుడిలా బరితెగించాడు. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన పెదకాకాని పోలీస్ స్టేషన్ పరిధిలో జరగగా బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు శుక్రవారం తెలిపారు. పెదకాకానికి చెందిన ఓ వ్యక్తి తన అన్న కుమార్తెపై కన్ను వేశాడు. మాయ మాటలు చెప్పి లోపరచుకొని, గత నాలుగు నెలలుగా బాలికపై అత్యాచారం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆ బాలిక మూడు నెలల గర్భం దాల్చింది. విషయం బహిర్గతం కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

పెదకాకాని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. కాకాని రోడ్డులోని తారకరామ నగర్‌కు చెందిన మాచర్ల హరిబాబు(35) అనే వ్యక్తి పాలిష్ రాళ్ల పని చేస్తుంటాడు. భార్యతో మన స్పర్థలు రావడంతో గడ్డిపాడు సమీపంలోని ఇన్నర్ రింగ్ రోడ్డు రైలు గేటు వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు స్వాధీన పరుచుకొని మార్చురీకి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పిడుగురాళ్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల ఫ్లైఓవర్‌పై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసరావుపేటకు చెందిన మల్లాల వీరాంజనేయులు (35) మృతి చెందాడు. అత్తగారి ఊరైన పిడుగురాళ్లకు వచ్చి తెల్లవారుజామున 3.30 నిమిషాలకు నరసరావుపేటకు ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఫ్లై ఓవర్ బ్రిడ్జి పైనుంచి కిందపడి మృతి చెందాడు. ఎస్‌ఐ మోహన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసు నుంచి తప్పించేందుకు విఫలయత్నం

- హతురాలి కుమారుడు ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
- నిందితుల జాబితాలో నందిగం సురేశ్ పేరు చేర్చని వైనం
- ప్రస్తుత విచారణలో 78 నిందితుడిగా నందిగం

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాంతంలోని వెలగపూడి దళిత కాలనీలో జరిగిన మెండెం మరియమ్మ హత్య కేసు నుంచి నాటి బాపట్ల ఎంపీ నందిగం సురేశ్‌ను తప్పించేందుకు పోలీసులు శత విధాల ప్రయత్నించారు. చివరకు కోర్టులను సైతం తప్పుదారి పట్టించేలా వ్యవహరించారు. హతురాలి కుమారుడుతోపాటు కుటుంబ సభ్యులు, బంధువులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఎంపీ నందిగం సురేశ్ ప్రోద్బలంతోనే మరియమ్మ హత్య జరిగిందని పేర్కొన్నప్పటికీ పోలీసులు నిందితుల జాబితాలో ఆయన పేరు కనిపించకుండా జాగ్రత్త పడ్డారు. ఈ కేసులో ప్రధాన నిందితుడుగా (ఎ1) సురేశ్‌ను చేర్చాల్సి ఉన్నప్పటికీ పోలీసులు ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పోలీస్ వ్యవస్థ అత్యంత దారుణంగా వ్యవహరించిందనడానికి మరియమ్మ హత్య కేసు దర్యాప్తు ఉదంతమే కారణంగా చెప్పుకోవచ్చు.

ఫిర్యాదులో పేర్కొన్నా పట్టించుకోలేదు..

రాజధాని ప్రాంతంలోని ఉద్దండరాయుని పాలెం కు చెందిన నందిగం సురేశ్ వైసీపీ నుంచి బాపట్ల ఎంపీగా గెలుపొందారు. బాపట్ల ఎంపీ అయినప్పటికీ స్థానికంగా రాజధాని ప్రాంతానికి చెందిన వాడు కావడంతో ముఖ్యంగా తుళ్లూరు మండలంపై ఆయన ఆధిపత్యం స్పష్టంగా కనిపించింది. దీనిలో భాగంగా రాజధానిలో కీలక ప్రాంతమైన వెలగపూడిలోని దళిత కాలనీలో ఎస్సీ సామాజిక వర్గంలోని రెండు ఉప కులాల మధ్య ఎప్పటి నుంచో వైరం ఉంది. దళితవాడ మెయిన్ రోడ్డుపై మాల సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు ఉన్నాయి. మెయిన్ రోడ్డు నుంచి లోనికి వెళ్తే వీరి కాలనీ దాటిన తర్వాత మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారి ఇళ్లు ఉన్నాయి. మాదిగ వర్గానికి చెందిన కుటుంబాలు నందిగం సురేశ్‌ను అనుసరిస్తున్నాయి. ఈ క్రమంలో బాపట్ల ఎంపీగా నందిగం సురేశ్ విజయం సాధించిన తర్వాత ఆ కాలనీలో ఆయన వర్గీయులు హవా కొనసాగించారు. ఆ కాలనీ మెయిన్ రోడ్డుపై ఆర్చ్ నిర్మించాలని సురేశ్ వర్గీయులు నిర్ణయించారు. అంతేగాక ఆర్చ్‌కి బాబు జగ్జీవన్‌రామ్ పేరు పెట్టాలని, ఆ తర్వాత మొత్తం కాలనీ కూడా జగ్జీవన్‌రామ్ కాలనీగా నామకరణం చేయాలని వారు భావించారు. అయితే తాము నివాసం ఉండే తమ ఇళ్ల వద్ద మీరు ఎలా ఆర్చ్ కట్టుకుంటారని, మీ ఇళ్ల వద్ద మీరు ఆర్చి కట్టుకోవాలని మాల సామాజిక వర్గానికి చెందినవారు అభ్యంతరం చెప్పారు. ఈ విషయంలో ఆ రెండు వర్గాల మధ్య వివాదం తలెత్తింది. దీంతో 2020 డిసెంబర్ 24న ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. ఈ విషయం మనసులో పెట్టుకున్న ఇరువర్గాలు అదే నెల 27న మరోసారి గొడవపడి రాళ్ళు రువ్వుకున్నాయి. ఈ ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన పలువురికి తలలు పగిలాయి. నందిగం సురేశ్ వర్గీయులు చేసిన దాడిలో ప్రత్యర్థి వర్గానికి చెందిన మెండెం మరియమ్మ తలకు బలమైన రాయి తగిలింది. ఆసుపత్రికి వెళ్లే సమయానికి ఆమె మృతి చెందింది. ఈ ఘటనపై మరియమ్మ కుమారుడు మెండెం బాబు తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎంపీ నందిగాం సురేశ్ ప్రోద్బలంతోనే తమపై దాడి చేసి తన తల్లి మరియమ్మను హత్య చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ ఫిర్యాదులో ఎంపీ నందిగం సురేశ్‌తోపాటు మరో 36 మంది పేర్లను పేర్కొన్నారు. అయితే పోలీసులు క్రైం నంబర్ 390/2020 గా నమోదు చేసిన కేసులో ఐపీసీ 147, 148, 302, 109 రెడ్ విత్ 149 సెక్షన్లను పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్‌లో పోలీసులు పది మంది నిందితుల పేర్లను పేర్కొన్నారు. మిగిలిన వారి పేర్లు రాయకుండా నిందితులుగా పేర్కొన్నారు. వాస్తవానికి మరియమ్మ కుమారుడు బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నందిగం సురేశ్‌ను ప్రధాన నిందితుడిగా (ఎ1) చేర్చాల్సి ఉంది. రాజకీయ ఒత్తిళ్లతో ఆ పేరు చేర్చలేదు. అలాగని ఆయన నిందితుడు కాదని కూడా పేర్కొనలేదు. ఫిర్యాదులో పేర్కొన్న వారంతా నిందితులు గానే పేర్కొన్నారు. అంతేగాక పోలీసులు ఎఫ్ఐఆర్ లో పేర్కొన్న సెక్షన్ 109 అనేది ఒకరి ప్రోద్బలంతో హత్య జరిగినట్లు సూచిస్తుంది. ఫిర్యాదులో పేర్కొన్నట్లుగా బాపట్ల ఎంపీ నందిగం సురేశ్ ప్రోద్బలం అనేదానికి సెక్షన్ 109 వర్తిస్తుంది. అయితే నిందితుల జాబితాలో మాత్రం ఆయన పేరును చేర్చలేదు.

77కు చేరిన నిందితుల సంఖ్య

ఆ తర్వాత జరిగిన కేసు విచారణలో పోలీసులు మరో 41 మందిని నిందితులుగా గుర్తించి నిందితుల జాబితాలో చేర్చారు. చట్ట ప్రకారం కనీసం ఎ1 గా చేర్చకపోయినప్పటికీ మిగిలిన 41 మంది నిందితుల జాబితాను చేరుస్తున్న సమయంలో 37వ నిందితుడిగా చేర్చి ఆ తర్వాత మిగిలిన 41 మంది పేర్లతో జాబితాను తయారు చేయాల్సి ఉంది. అలా చేయకుండా సురేశ్ పేరు తప్పించి 36 మందిని నిందితులుగా చేర్చి ఆ తర్వాత గుర్తించిన 41 మంది పేర్లను కూడా చేర్చారు దీంతో ఈ కేసులో నిందితుల సంఖ్య 77గా పేర్కొన్నారు. ఆ కేసులో మొదట నిందితులుగా గుర్తించిన 36 మందిలో ఒకరిద్దరూ ముందస్తు బెయిల్ తెచ్చుకోగా ఒకరు మృత్యువాత పడ్డారు. మిగిలిన 41 మందిని నిందితులుగా చేర్చినప్పటికీ నాలుగేళ్ల పాటు ఒక్కరిని కూడా అరెస్టు చేయలేదు. కోర్టులో ఛార్జిషీటు కూడా దాఖలు చేయలేదు. అయితే మిగిలిన 41 మందిని నిందితుల జాబితాలో చేర్చిన తర్వాత నిందితుల బెయిల్ పిటిషన్ సందర్భంగా పోలీసులు వేసిన పిటిషన్‌లో ఆయా నిందితులకు బెయిల్ ఇచ్చినా తమకు అభ్యంతరం లేదని తేల్చి చెప్పేశారు.

పీటీ వారెంట్‌పై అరెస్టు

ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కేసులో బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు ఆ కేసు ఫైల్ ను బయటకు తీశారు. అప్పటి డీఎస్పీ జై.శ్రీనివాసరావు అత్యంత దారుణంగా వ్యవహరించినట్లు పోలీస్ ఉన్నతాధికారులు గుర్తించారు. కాగా తుళ్లూరు సీఐగా నియమితులైన గంగా వెంకటేశ్వర్లు కేసును దర్యాప్తు చేస్తున్నారు. దీనిలో భాగంగా హతురాలి కుమారుడు బాబు ఇచ్చిన ఫిర్యాదుతో పాటు శవ పంచనామ సమయంలో అతని బంధువులు ఇచ్చిన ఫిర్యాదులోనూ, అదేవిధంగా వారి కుటుంబ సభ్యులు నలుగురు పోలీసులకు ఇచ్చిన స్టేట్మెంట్ లోనూ నందిగం సురేష్ పేరు స్పష్టంగా ఉంది. వాటన్నింటిని పరిగణలోకి తీసుకున్న సీఐ వెంకటేశ్వర్లు ఈ కేసులో 78వ నిందితునిగా సురేశ్ పేరు చేర్చారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై జరిగిన దాడి కేసులో నిందితునిగా జిల్లా జైలులో ఉన్న నందిగం సురేశ్‌ను ఈ హత్య కేసులో పీటీ వారెంట్‌పై అరెస్టు చేశారు. ప్రస్తుతం ఆయన జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఇటీవలే సురేష్‌ను తుళ్ళూరు పోలీసులు రెండు రోజులు కస్టడీకి తీసుకుని విచారించారు. విచారణకు సురేశ్ సహకరించలేదని పోలీసులు తెలిపారు.

ఆస్తి కోసం కన్నకొడుకునే కడతేర్చిన తల్లి


వివరాలు వెల్లడిస్తున్న సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతురావు

క్రోసూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొద్దిపాటి ఆస్తికోసం కన్నకొడుకునే బంధువులు, మరో కుమారుడితో కలిసి హత్య చేయించింది ఓ కసాయి తల్లి. క్రోసూరు మండలం హసానాబాద్‌లో అక్టోబరు 27 రాత్రి జరిగిన ఈ సంఘటనలో పది మంది నిందితులను అరెస్టు చేసినట్లు సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతురావు గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. హసానాబాద్‌కు చెందిన షేక్ మున్నీబీకి ఇద్దరు భర్తలు ఉండేవారు. సుమారు 20 ఏళ్ల క్రితం విడిపోయిన మొదటి భర్తకు షేక్ మహబూబ్ బాషా అనే కుమారుడు ఉన్నాడు. తర్వాత వివాహం చేసుకున్న రెండో భర్తకు షేక్ అబ్దుల్ బాషిత్, షేక్ పాతిమా సంతానం ఉన్నారు. పెద్ద కుమారుడు మహబూబ్ బాషాకు విడిపోయిన భర్త ద్వారా ఎకరం 50 సెంట్ల పొలం, ఐదు సెంట్ల స్థలం, తాత ద్వారా అర ఎకరం పొలం వచ్చింది. రెండో భర్త కుమారుడు బాషిత్‌కు 50 సెంట్ల పొలం, 25 సెంట్ల స్థలం రెండో భర్త ద్వారా వచ్చింది. రెండో భర్త 15 ఏళ్ల క్రితం చనిపోయాడు. పెద్ద కుమారుడికి ఎక్కువ ఆస్తి, రెండో కుమారుడికి తక్కువ ఆస్తి రావడాన్ని తల్లితో సహా, రెండో కుమారుడు, బంధువులు జీర్ణించుకోలేక పోయారు. ఆస్తి మొత్తం కలిపి సమానంగా పంచుకుందామని తరచూ గొడవలు పడుతుండేవారు. పెద్ద కుమారుడు మహబూబ్ బాషా దీనికి ససేమిరా అనడంతో అతన్ని ఎలాగైనా కడతేర్చి ఆస్తి కాజేయాలని పథకం పన్నారు. అక్టోబరు 27 రాత్రి షేక్ అబ్దుల్ బాషిత్, తల్లి షేక్ మున్నీబీ, బంధువులు జైలూలబ్దీన్, నాగుల్ మీరా, నన్నే సాహెబ్, మాబు సుభాని, మహబూబ్ సుభాని, కరీముల్లా, పెద్ద బాజీ, నుషరత్, మరో నలుగురు కలిసి కర్రలు, ఇనుప రాడ్లు, కారం, మొదలైన వాటితో మహబుబ్ బాషా ఇంటికి వెళ్లి విచక్షణా రహితంగా కొట్టారు. అడ్డుకోబోయిన భార్య షేక్ కౌసర్, మామ చిన్నబాజీ, ఆర్నెల్ల చిన్నారిపై కూడా దాడి చేశారు. గాయపడిన వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా అక్టోబరు 28న ఉదయం మహబూబ్ బాషా మృతి చెందాడు. మిగిలిన వారు చికిత్స పొందుతున్నారు. సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతురావు పర్యవేక్షణలో సీఐ వి.సురేష్, క్రోసూరు ఎస్ఐ కె.నాగేంద్రరావు, మరో నలుగురి కానిస్టేబుల్‌తో కూడిన బృందం పది మంది నిందితులను అరెస్టు చేసినట్లు, వారి నుంచి ఇనుప రాడ్లు, మోటారు సైకిల్‌లు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను సత్తెనపల్లి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు పంపినట్లు తెలియజేస్తూ 48 గంటల్లో నిందితులను అరెస్టు చేసిన పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

మళ్లీ గోడదూకి పారిపోయిన విద్యార్థులు


బోయపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాల


యడ్లపాడు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలం బోయపాలెం గ్రామ పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు గోడదూకి పరారయ్యారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఏడుగురు విద్యార్థులు శుక్ర వారం ఉదయం సుమారు 5 గంటల సమయంలో పాఠశాల ప్రహరీ గోడ దూకి వెళ్లారు. ఈ ఏడాది సెప్టెంబరు 23న పదో తరగతి చదు వుతున్న 60 మంది విద్యార్థులు పాఠశాలలో సౌకర్యాలు బాగాలేవని, రాత్రిపూట భోజనం సరిగా ఉండడంలేదని, తమను అనవసరంగా కొడుతున్నారంటూ గోడ దూకి కొండవీడు కొండలవైపు పరుగు పె ట్టారు. పోలీసులు, స్థానికుల సహకారంతో విద్యార్థులను పట్టుకుని పాఠశాలకు తరలించారు. ఈ విషయం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో విచారణకు త్రిసభ్య కమిటీని వేశారు. విచారించిన కమిటీ సంఘటనకు కారకులంటూ 5గురు పార్టుటైం ఉపాధ్యాయులను తొలగింపునకు సిఫారసు చేయగా ఉన్నతాధికా రులు వారిని తొలగించి చేతులు దులుపుకున్నారు. అయితే సంఘటన లకు ప్రధాన కారకులు ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ అని వారిని ఇక్కడ నుంచి వేరోచోటుకు మార్చాలని విద్యార్థులు చేసిన డిమాండ్‌ను అధికారులు పట్టించుకోలేదు. దీంతో మరో మారు అవే కారణాలతో విద్యార్థులు పరారయ్యారు. అయితే ఈ సారి విద్యార్థులు పాఠశాల నుంచి బయటకు వెళ్తూ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారిలో నలుగురు విద్యార్థులు తల్లిదండ్రులు వచ్చేవరకు బోయపా లెంలో ఉండి వారితో కలసి పాఠశాలకు రాగా మిగిలిన ముగ్గురు తుర్లపాడులోని స్నేహితుని ఇంటికి వెళ్లినట్లు తెలుసుకుని పోలీసుల సహకారంతో పాఠశాలకు తీసుకొచ్చారు.


విద్యార్థులను ప్రేరిపించడంతోనే సమస్య

విద్యార్థులను కొందరు ఉపాధ్యాయులు రెచ్చగొట్టడం వల్లనే సమస్య ఏర్పడిందని డీసీవో పద్మజ అన్నారు. కొందరు విద్యార్థుల ప్రవర్తన దారుణంగా ఉందనీ, వారం రోజుల కిందట 10 మంది విద్యార్థులను ఇంటికి పంపించినట్లు చెప్పారు. ఈ విషయాన్ని అడిష నల్ సెక్రటరీకి నివేదించామని, వారి నిర్ణయం మేరకు తదుపరి చర్య లు తీసుకుంటామన్నారు. అవే కారణాలతో విద్యార్థులు మళ్లీ ఎందుకు పారిపోయారంటూ విలేకరులు ప్రశ్నించగా గతంలో రెచ్చగొట్టిన ఉపాధ్యాయుల ప్రేరణ విద్యార్థుల్లో అలానే ఉండడంతో ఇలా ప్రవర్తిం చారంటూ విద్యార్థులదే తప్పంటూ సమర్థించుకునే ప్రయత్నం చేశారు. సంఘటన జరిగిన తరువాత కూడా పాఠశాలలో ఉండాల్సిన ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ ఉండడం లేదు కదా, వారు స్థానికంగా ఉంటే ఈ సమస్యలు రావు కదా అని ప్రశ్నించడంతో ఇక్కడే ఉంటున్నారంటూ సమర్థించుకునే ప్రయత్నం చేశారు.

రైలు ఢీకొని తల్లీ కూతురు మృతి

● కావలి రైల్వే స్టేషన్‌లో ఘటన


వజ్రమ్మ (ఫైల్ ఫొటో)


శిరీష (ఫైల్ ఫొటో)

పిట్టలవానిపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని తల్లీ కూతురు మృతి చెందిన ఘటన కావలి రైల్వే స్టేషన్‌లో జరిగింది. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు.. బాపట్ల జిల్లా అల్లూరుకు చెందిన నత్తల వజ్రమ్మ(60) కావలి పట్టణంలోని బర్మాషెల్ వీధిలో నివాసం ఉంటున్న కుమార్తె గొర్నెపూడి శిరీష(35) వద్దకు వచ్చింది. తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు గురువారం తెల్లవారుజామున బయలుదేరింది. తల్లి నత్తల వజ్రమ్మను తీసుకుని స్వగ్రామంలో వదిలి వచ్చేందుకు తల్లితోపాటు కుమార్తె రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. అయితే ఒంగోలు వైపు వెళ్లే రైళ్లు 3వ నంబరు ఫ్లాట్‌ఫాం మీదకు వస్తుండటంతో తల్లీ కూతురు 3వ నంబరు ఫ్లాట్‌ఫాంపై ఆగారు. అయితే బిట్రగుంట నుంచి విజయవాడ వెళ్లే ప్యాసింజర్ రైలు 1వ నంబరు ఫ్లాట్‌ఫాంపైకి వస్తున్నట్లు రైల్వే అధికారులు అనవున్స్‌మెంట్ చేయడంతో వారిద్దరు 3వ నంబరు ఫ్లాట్‌ఫాం నుంచి 1వ నంబరు ఫ్లాట్‌ఫాం పైకి వచ్చేందుకు పట్టాలపై దిగారు. కుమార్తె శిరీష ముందుగా 2వ నంబరు ఫ్లాట్‌ఫాంపైకి ఎక్కింది. ఆమె తల్లి వజ్రమ్మ ఎక్కలేకపోగా అదే సమయంలో ఆ పట్టాలపై రైలు వస్తుండడంతో తల్లిని కాపాడేందుకు ఫ్లాట్‌ఫాం దిగి ఆమెను పైకి ఎక్కించే క్రమంలో కొయంబత్తూరు ఎక్స్‌ప్రెస్ వేగంగా వచ్చి వారిని ఢీకొంది. దీంతో ఇరువురి మృతదేహాలు పట్టాలపై చల్లాచెదరుగా పడ్డాయి. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వజ్రమ్మ మృతదేహాన్ని అల్లూరు గ్రామ పంచాయతీలోని నత్తలవారిపాలెం గ్రామానికి, శిరీష మృతదేహాన్ని నాదెండ్ల మండలం తిమ్మాపురం గ్రామానికి తీసుకెళ్లారు.

డిపాజిట్లపై అత్యధిక వడ్డీ రేటు

● అర్బన్ బ్యాంకు చైర్మన్ శ్రీనివాస యాదవ్



గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): డిపాజిట్లపై అత్యధిక వడ్డీరేటు చెల్లిస్తున్నామని ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ చైర్మన్ బోనబోయిన శ్రీనివాసయాదవ్ తెలిపారు. స్వల్ప, దీర్ఘకాలిక పరిమితిని బట్టి వడ్డీరేట్లు అమలు చేస్తున్నామన్నారు. సీనియర్ సిటిజన్లకు అదనంగా చెల్లింపులు చేస్తున్నామని చెప్పారు. ఖాతాదారుల్లో నమ్మకాన్ని పెంపొందిస్తూ బ్యాంకుని లాభాల బాట పట్టించిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.



అర్బన్ బ్యాంకులో వడ్డీరేట్లు ఎలా ఉన్నాయి?

చైర్మన్: 30 నుంచి 90 రోజుల వరకు సాధారణ పౌరులు, సీనియర్ సిటిజన్స్‌కి 5.50 శాతం, 91 నుంచి 180 రోజులకు సాధారణ పౌరులకు 6.50 శాతం, సీనియర్ సిటిజన్స్‌కి 7 శాతం, 181 రోజుల నుంచి 12 నెలల్లోపు 7.50 శాతం, 8 శాతం, 12 నెలల నుంచి 36 నెలల వరకు 8.50 శాతం, 9 శాతం, 36 నెలలపైన 8.60 శాతం, 9.10 శాతం చెల్లిస్తున్నాం.

రుణాలు ఎన్ని కేటగిరీల్లో ఇస్తున్నారు?

చైర్మన్: మార్ట్‌గేజ్, హోం, గోల్డ్, ప్రాజెక్టు ఫైనాన్స్, ఓవర్ డ్రాఫ్టు, అర్బన్ షార్ట్ టర్మ్, వెహికల్, ఎడ్యుకేషన్ రుణాలు అతి తక్కువ వడ్డీతో ఇస్తున్నాం.

డిజిటల్ సర్వీసులు అందుబాటులో ఉన్నాయా?

చైర్మన్: ఆటోమేటెడ్ టెల్లర్ మెషీన్, ఏటీబీఎస్, ఆర్‌టీజీఎస్/ఎన్ఈఎఫ్‌టీ, ఏ బ్రాంచ్‌లోనైనా బ్యాంకింగ్, డిమాండ్ డ్రాఫ్టు అండ్ పే ఆర్డర్, సీటీఎస్ క్లియరింగ్, పాజిటివ్ పే, యూపీఐ, ఏసీహెచ్ క్రెడిట్ డెబిట్, ఐఎంపీఎస్, మొబైల్ బ్యాంకింగ్, క్యూఆర్ కోడ్ పేమెంట్ స్కానర్ కోడ్, మొబైల్ అప్లికేషన్లు అందుబాటులోకి తీసుకొచ్చాం.

మొండి బకాయిల విషయంలో ఎలాంటి చర్యలు చేపట్టారు?

చైర్మన్: బ్యాంకు సిబ్బంది అందరిలో జవాబుదారితనాన్ని పెంచాం. సీసీటీవీ సర్వైలెన్స్ ద్వారా ఎప్పటికప్పుడు వారి పనితీరుని గమనిస్తున్నాం. రుణాల రికవరీ బాధ్యత అప్పగించి మొండిబకాయిదారుల ఇళ్లకు పంపిస్తున్నాం. బాధ్యతారహితంగా విధులు నిర్వహించే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నాం.

టీటీడీ బోర్డు సభ్యుడిగా నన్నపనేని



తుళ్లూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) బోర్డు సభ్యుడిగా తుళ్లూరు మండలం దొండపాడు గ్రామానికి చెందిన నన్నపనేని సదాశివరావును కూటమి ప్రభుత్వం నియ మించింది. నాట్కో ఫార్మా సంస్థ వైస్ చైర్మన్‌గా కొనసా గుతున్న సదాశివరావు అనేక స్వచ్ఛంద సేవా కార్యక్ర మాలను నిర్వహించారు. పదిహేను సంవత్సరాల క్రితమే దొండపాడులో నాట్కో సంస్థ తరుపున శుద్ధ తాగు జల కేంద్రం ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీరు అందజేశారు ఇప్పటికి ఆ మినరల్ ప్లాంట్ నుంచి కేవలం రూ.2లకే 20 లీటర్ల అందిస్తున్నారు. వెంకటపాలెం చిగురు అనాథ బాలల ఆశ్రమ సంక్షేమానికి భారీ విరాళాలు అందించారు. గుంటూరు జీజేహెచ్‌లో క్యాన్సర్ డయోగ్నస్టిక్ యూనిట్‌ను నాట్కో సంస్థ తరుపున బిల్డింగ్‌ను నిర్మాణం చేసి ఉచితంగా వైద్య సేవలు అందించటంలో నన్నపనేని సదాశివరావు కృషి చేశారు. ఇవే కాక వివిధ ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాలు అమలు చేయ టంలో నన్నపనేని సదాశివరావు పేరు సంపాదించారు. సీఎం చంద్రబాబు నాయుడు సదా శివరావు సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తించి గురువారం టీటీడీ బోర్డు సభ్యుడిగా నియమించారు. సమాజ సేవా దృక్పథం, రాజధాని అమరావతికి భూములిచ్చిన రైతులకు ప్రాధాన్యతనిస్తూ ఆ ప్రాంతానికి చెందిన నన్నపనేని సదాశివరావుకు పదవిని కేటాయించటంపై రైతు జేఏసీ నాయకులు, రైతులు, రైతు కూలీలు, మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

థాయిలాండ్ అంతర్జాతీయ సదస్సుకు వర్సిటీ అధ్యాపకులు

పెదకాకాని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): థాయిలాండ్, బ్యాంకాక్‌లో ఈనెల 8, 9 తేదీల్లో జరగనున్న 'పరిశోధన - ఆవిష్కరణలపై' అంతర్జాతీయ సమావేశానికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఎకనామిక్స్ విభాగాధిపతి, పీజీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ఆచార్య కడిమి మధుబాబు, వర్సిటీ హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి ఆచార్య బి.నాగరాజు హాజరు కానున్నారు. ఈ మేరకు ఇంటర్నేషనల్ సైంటిఫిక్ రీసెర్చ్ అసోసియేషన్ నుంచి అధికారిక ఆహ్వాన పత్రిక అందినట్లు ఆచార్య మధుబాబు తెలిపారు. యురేషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, షినవత్రా విశ్వవిద్యాలయం, పాతుమ్ థాని, థాయిలాండ్, రిసెర్చ్ కల్చర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు జరుగుతుందని చెప్పారు. సదస్సులో "స్వచ్ఛ భారత్ మిషన్ అండ్ ఇట్స్ రోల్ ఇన్ ట్రాన్స్ఫార్మింగ్ రూరల్ శానిటేషన్ ఇన్ ఇండియా" అంశంపై ఆచార్య మధుబాబు, "ఎక్స్ప్లోరింగ్ క్వాలిటీ ఆఫ్ వర్క్ లైఫ్ ఫర్ వుమెన్ ఎంప్లాయిస్: ఏ కే స్టడీ ఇన్ సౌత్ సెంట్రల్ రైల్వే" అంశంపై డాక్టర్ నాగరాజు పరిశోధన పత్రం సమర్పణకు అనుమతి లభించినట్లు వెల్లడించారు. అంతర్జాతీయ సదస్సులో పరిశోధన పత్రం సమర్పించనున్న ఆచార్య మధుబాబు, ఆచార్య నాగరాజులను వర్సిటీ ఉన్నతాధికారులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

ఉరి వేసుకొని గొర్రెలకాపరి ఆత్మహత్య

పిట్టలవానిపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు కాచే ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని మంతెనవారిపాలెం గ్రామపంచాయతీకి చెందిన ముకిరి కోటయ్య (21) గొర్రెల కాపరిగా పనిచేస్తు న్నారు. తన ఇంటి ప్రాంతంలో ఉన్న ఓ వ్యక్తికి సంబంధించిన రెండు గొర్రెలను తన గొర్రెలతోపాటు కోటయ్య అమ్ముకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఆ వ్యక్తి మృతుడిపై దౌర్జన్యంగా మాట్లాడి పోలీసుస్టేషన్‌లో కేసుపెడతానని బెదిరిం చాడని, దీనికి మనస్తాపం చెంది ఉరి వేసుకుని మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట నవంబరు 1 (ఆంధ్రజోతి): పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 42.16 టియంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 31,137 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద 30,234 క్యూసెక్కుల నీరుదిగువ కృష్ణకు విడుదలౌతుంది. వీటిలో 16వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా కృష్ణా నదికి చేరుతున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

18,503 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 12,825 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 18,503 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 18,157 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8500	16000	334	9500	15500
నెంబరు. 5	8000	9200	నెంబరు. 5	--	--
273	--	--	273	15500	15500
341	8800	14500	341	9000	13500
4884	12000	12000	4884	11800	16500
సూపర్ 10	--	--	సూపర్ 10	10000	15700
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	9000	18200	తేజ	10000	18000
బ్యాడిగి	9000	15500	బ్యాడిగి	9000	14600
దేవనూరు డీలక్స్	--	--	దేవనూరు డీలక్స్	10500	12000
తెల్లకాయలు	5000	10000	తెల్లకాయలు	6000	11000

నాటు సారా స్వాధీనం

దుర్గి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులేశునిపల్లె గ్రామ శివారులో అంగటి శ్రీనివాసరావు నాటుసారా విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు శుక్రవారం ఎస్ఐ సుధీర్‌కుమార్ తన సిబ్బందితో ఓబులేశునిపల్లె చేరుకున్నారు. శ్రీనివాసరావును అదుపులోకి తీసుకొని అతని వద్దనుంచి 5లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంట సిబ్బంది సైదులు, లక్ష్మయ్య ఉన్నారు.

పింఛను కోసం పడిగాపులు

పెదకూరపాడు,నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛను కోసం గంటల తరబడి వృద్ధులు, దివ్యాంగులు ఎదురుచూశారు. శుక్రవారం ఒకటవ తేది పింఛను పంపిణీ చేయాల్సివుండగా సర్వర్ మొరాయించడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది .ఉదయం 11 గంటలకల్లా పూర్తయ్యే పింఛను పంపిణీ సాయంత్రానికి పూర్తయింది.

అయ్యప్పలకు అన్నప్రసాదం

అమరావతి, నవంబరు 1: అయ్యప్ప మాల ధరించిన స్వాములకు శనివారం నుంచి అన్నప్రసాద కార్యక్రమం జరుగుతుంది. మండల కేంద్రమైన అమరావతిలోని మిట్టమీద రామాలయం, ధరణికోట గ్రామంలో విఘ్నేశ్వర అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో 41 రోజుల పాటు అన్నప్రసాద కార్యక్రమం జరుగుతుంది. వివిధ దేవతా మూర్తుల మాలలు ధరించిన స్వాములు కార్యక్రమంలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

కోటేశ్వరరావు మృతి

టీడీపీకి తీరని లోటు

నకరికల్లు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకులు, నకరికల్లు తొలి మండల పరిషత్ అధ్యక్షుడు సాగి కోటేశ్వరరావు మృతి టీడీపీకి తీరని లోటని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం నకరికల్లు మండలం చల్లగుండ్లలో సాగి కోటేశ్వరరావు భౌతిక కాయంపై పుష్పగుచ్ఛం వుంచి ఎమ్మెల్యే కన్నా నివాళులర్పించారు. కోటేశ్వరరావు కుమారులు సాగి శ్రీనివాసరావు, సుబ్బారావులను ఎమ్మెల్యే కన్నా పరామర్శించారు.

నేటి నుంచి దైద బిలంలో

కార్తీక మాస ఉత్సవాలు

గురజాల టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దైద బిలంలో శనివారం నుంచి కార్తీక మాస ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో పూర్ణచంద్రరావు తెలిపారు. ఈనెల 2వ తేదీ నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నట్లు చెప్పారు. ఉదయం 4 గంటల నుంచి 7 గంటల వరకు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు సూచనలు మేరకు భక్తుల కోసం అన్ని వసతులు ఏర్పాటు చేశామన్నారు.

రైతులకు వరంగా

సంగం డెయిరీ

మాచవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సంగం డెయిరీ రైతుల పాలిట వరంగా మారిందని సంగం డెయిరీ డైరెక్టర్ పులుకూరి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తగణేశునిపాడు సంగం డెయిరీ అధ్యక్షుడు కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. ఇటీవల స్థానిక సంగం డెయిరీ అధ్యక్షుడు చల్లగుండ్ల సత్యనారాయణ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సంగం డెయిరీ డీవీసీ అభయ పథకంలో భాగంగా మరణ సహాయ నిధి స్కీం కింద సంగం డెయిరీ రూ. 1,36,015లు, ప్రొడ్యూసర్ వెల్ఫేర్ స్కీం కింద రూ. 50 వేలు, మట్టి ఖర్చుల కింద రూ. 15 వేలు మొత్తంగా రూ. 2,01,015లను మృతుని భార్య కోటేశ్వరమ్మకు అందజేశారు. కార్యక్రమంలో గంగిరెడ్డిపాలెం పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ కర్రి శ్రీనివాసరావు, గురజాల పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ ఉప్పలపాటి రంగారావు, ఫీల్డ్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, సంగం అధ్యక్షురాలు చల్లగుండ్ల రమాదేవి, ఇన్‌చార్జి సర్పంచి పల్లా నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు

విక్రయిస్తే చర్యలు

మాచర్లటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాచర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వైన్ షాపుల్లో మద్యం ఎమ్మార్పీ ధరకు మించి అధిక రేట్లకు విక్రయిస్తే నిర్వాహకులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ ఎన్.వెంకటరమణ హెచ్చరించారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వైన్ షాపుల నిర్వాహకులు మద్యం బాటిళ్లపై ఉన్న ఎమ్మార్పీ ధరకే విక్రయించాలన్నారు. అలాగే నాటుసారా, ఇతర రాష్ట్రాల మద్యం విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

అంతర జిల్లాల ఖోఖో పోటీలకు

ఒప్పిచర్ల విద్యార్థిని

కారంపూడి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అంతర జిల్లాల ఖోఖో పోటీలకు మండలంలోని ఒప్పిచర్ల జిల్లా పరిషత్ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని నాగశ్రీలక్ష్మి ఎంపికైనట్లు హెచ్ఎం విజయలలిత తెలిపారు. శుక్రవారం హైస్కూల్‌లో విద్యార్థిని నాగశ్రీలక్ష్మిని అభినందించి ఆమె మాట్లాడారు. గత నెల 28వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన నకరికల్లులో ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్ - 17 ఖోఖో బాలబాలికల జట్ల ఎంపికలు జరిగినట్లు చెప్పారు. ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు అనకాపల్లి జిల్లా తుమ్మపాలెంలో జరిగే అంతర జిల్లాల ఖోఖో పోటీల్లో నాగశ్రీలక్ష్మి ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు.

జంగాకు అభినందనలు

కారంపూడి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యునిగా నియమితులైన మాజీ శాసనసభ్యుడు జంగా కృష్ణమూర్తిని కారంపూడి కూటమి నేతలు అభినందించారు. గురువారం దాచేపల్లి మండలం గామాలపాడులో జంగాను కలుసుకొని స్వీట్లు తినిపించి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఉప ఎంపీపీ కర్లా అమర సైదారావు, బీజేపీ రాష్ట్ర నేత శెట్టి హనుమంతురావు, టీడీపీ నేతలు తోట రంగారావు, వడ్లమూడి హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇంటివద్దకే పింఛన్

- మహిళల ఆర్థికాభివృద్ధికి చంద్రబాబు కృషి
- ఎమ్మెల్యే యరపతినేని
- పింఛన్లు, దీపం లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేత



అనారోగ్యంతో బాధ పడుతున్న మహిళకు పింఛన్‌ను అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే యరపతినేని, ఎమ్మెల్సీ జంగా

పిడుగురాళ్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్‌ను ఇంటివద్దనే అందిస్తున్నట్లు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని నాలుగో వార్డులో వృద్ధులు, వికలాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారి ఇంటి వద్దనే పింఛన్లను కలెక్టర్ అరుణ్‌బాబుతో కలిసి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అందజేశారు. అనంతరం దీపం పథకం-2 కింద పలువురు మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేశారు. అలాగే అసంపూర్తిగా పనులు నిలిచిపోయిన మున్సిపల్ భవనాన్ని కలెక్టర్ అరుణ్‌బాబుతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. భవనం నిర్మాణం పూర్తయి, వినియోగంలోకి రావడానికి రూ. 80 లక్షలు అవుతుందని అధికారులు తెలుపగా, వెంటనే టెండర్లుపిలిచి పనులు పూర్తయ్యేలా చూడాలని ఎమ్మెల్యే యరపతినేని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, చైర్మన్ కేవీ సుబ్బారావు, కమిషనర్ శ్రీధర్, ఉన్నం వెంకట్రావు, పాండురంగ శ్రీను, సర్వేశ్వరరావు, వడ్డవల్లి సాంబశివరావు, ఇన్‌చార్జ్ డీఆర్‌వో నారదముని, ఆర్డీవో మురళీకృష్ణ, తహసీల్దార్ జె.మధుబాబు, ఎంపీడీవో సీహెచ్ రామచంద్రరావు, ప్రత్యేక అధికారి ఆంజనేయులు, గుంటుపల్లి భుజంగరాయలు, కనిగిరి శ్రీను, బాబావలి, గండికోట వెంకటేశ్వర్లు, కామిశెట్టి రమేష్, ఖాశింసైదా, పిల్లి చెన్నారావు, పణితి రవి, యడ్లపల్లి నారాయణ, శివ, మందా డేవిడ్, ఎల్‌వీఆర్, వున్నం సురేష్, సాంబయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను తప్పక అమలుచేస్తాం

- మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి
- లబ్ధిదారులకు సామాజిక పింఛన్లు అందజేత



పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

మాచర్లటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్ని అవాంతరాలు ఎదురైనప్పటికీ ఇచ్చిన ప్రతి ఒక్క హామీని తప్పక అమలు చేస్తామని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో లబ్ధిదారులకు ఆయన సామాజిక పింఛన్లను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ యోగ క్షేమాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, యెనుముల కేశవరెడ్డి, టీడీపీ సీనియర్ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, శశిభూషణ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, చిన వెంకటరామిరెడ్డి, గురవారెడ్డి పాల్గొన్నారు.



నకరికల్లు సచివాలయంలో తెలంగాణా జడ్జిలు

నకరికల్లు సచివాలయాన్ని సందర్శించిన

తెలంగాణా న్యాయాధికారులు

నకరికల్లు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నకరికల్లు సచివాలయాన్ని తెలంగాణ రాష్ట్రానికి చెందిన జడ్జిలబృందం శుక్రవారం సందర్శించారు. పంచాయతీ కార్యదర్శి కేవీ శివప్రసాద్ జడ్జిలను సాదరంగా ఆహ్వానించారు. సచివాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవల గురించి, గ్రామాల అభివృద్ధికి చేపట్టే కార్యకలాపాల గురించి జడ్జిలకు శివప్రసాద్ వివరించారు. సచివాలయాన్ని సందర్శించిన వారిలో సివిల్ జడ్జీలు (జూనియర్ డివిజన్) కేవీఎస్ హరీష్‌బాబు(దేవరకొండ),శివనాయక్ (భద్రాచలం), ముదాసీర్ (జడ్చర్ల), సచిన్‌రెడ్డి (గోదావరిఖని), శ్రీనివాసరావు(నిజామాబాద్), రాజేశ్వర్ (కరీంనగర్)లు వున్నారు. కార్యక్రమలో అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం దిశగా కూటమి ప్రభుత్వం

- ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ
- మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్‌ల పంపిణీ



సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ అన్నారు. దీపం-2 పథకంలో భాగంగా పట్టణంలోని వెంగళరెడ్డి నగర్‌లో మహిళలకు శుక్రవారంఉచితంగా గ్యాస్ సిలిండర్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కన్నా ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ యెలినేడి రామస్వామి అధ్యక్షతన నిర్వహించిన సభలో కన్నా మాట్లాడుతూ ఎన్నికల హామీమేరకు మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్‌లను ఉచితంగా అందజేస్తామన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో నియంత పాలన కొనసాగిందన్నారు. ప్రజాస్వామ్యంలో నియంత పాలనకు చోటులేదని ప్రజలే వైసీపీకి గట్టిగా బుద్ధిచెప్పారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు తాతా జయప్రకాశ్ నారాయణ, నాయకులు తురకా మేరిగ్రేస్, మన్నవ శారదాదేవి, నూర్‌బాషా జానీబాబు, కట్ట శంకర్‌రావు, పూజల వెంకట కోటయ్య, చుక్కపల్లి కొండలు, మున్సిపల్ కమిషనర్ షమ్మి, ఆర్డీవో రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు కండి..

అలాగే పట్టణంలోని ఐఎంఏ హాలులో శుక్రవారం సాయంత్రం పట్టణంలోని డాక్టర్‌లతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేధావులంతా ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు కావాలని ఎమ్మెల్యే కన్నా వారికి సూచించారు. రాబోయే పట్టభద్రుల ఎన్నికలలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని కోరారు.

సత్తెనపల్లి రూరల్ (ఆంధ్రజోతి) : మండలంలోని ధూళిపాళ్ళ సమీపంలోని లయోల ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదు అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు పట్టభద్రుల ఓటునమోదు చేయించుకోవాలని, ఇందుకోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. మేధావులు విద్యావంతులు కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కన్నా కోరారు.

పంచారామాలకు బస్సు సర్వీస్

సత్తెనపల్లి నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 3, 10, 17, 24 తేదీలలో పంచరామాల క్షేత్రాల దర్శనం కోసం సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుండి ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌ను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ విజయ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బస్సు సత్తెనపల్లి నుంచి బయలుదేరి సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం, అమరావతి దేవాలయాల దర్శనాలు చేసుకుని సత్తెనలపల్లి చేరుతుందన్నారు. బస్సు చార్జీ కేవలం రూ.950 మాత్రమే అని ఆయన తెలిపారు. సత్తెనపల్లి తదితర ప్రాంతాలలోని ప్రజలు, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సత్తెనపల్లి నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాట ప్రకారం దీపం పథకం క్రింద మూడు గ్యాస్ సిలిండర్‌లను నారా చంద్రబాబు నాయుడు దీపావళి కానుకగా ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఎమ్మెల్యే కన్నా లక్ష్మనారాయణ ఆదేశాల మేరకు చంద్రబాబు నాయుడు చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రఘురాం నగర్‌కు చెందిన తెలుగు మహిళలు బి సంధ్య సాహిత్య, అవంతి, వాణి, సరోజిని, సుమతి పాల్గొన్నారు.



చిన్నారులకు బాణసంచా పంపిణీ చేసిన ఎస్పీ సతీమణి కుమారి

పరివర్తనలో బాణసంచా పంపిణీ

సత్తెనపల్లి నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా పరివర్తన పాఠశాలలో విద్యార్థులకు పలనాడు జిల్లా ఎస్పీ సతీమణి కుమారి బాణసంచా పంపిణీ చేశారు. అక్కడ ఉన్న 30మంది మానసిక వికలాంగులైన చిన్నారులతో ఆమె కొద్ది సేపు ఆనందకరంగా గడిపారు. ఈ సందర్భంగా ఆమెకు ఆశ్రమ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు

ఎమ్మెల్యే ఆర్థిక సాయం

దాచేపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలకు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అందజేసిన నగదును టీడీపీ నాయకులు శుక్రవారం అందజేశారు. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురం కాలనీలో అనారోగ్య సమస్యలతో మృతిచెందిన బండారు చినవీరయ్య, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు కుటుంబాలకు చెరో రూ. 25 వేలు చొప్పున రూ. 50 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు కాలనీవాసులతో మాట్లాడుతూ కాలనీలోని 800 జనాభాకు రూ.20 లక్షలతో వాటర్ ట్యాంక్ నిర్మించేందుకు ఎమ్మెల్యే యరపతినేని నిధులు మంజూరు చేశారని తెలిపారు. అలాగే అంజనాపురం కాలనీలో పది రోజుల పాటు మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయడంతో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు కూడా కాలనీలో మకాం వేసి డయేరియా లక్షణాలను అదుపులోకి తెచ్చారని వివరించారు. బడుగు బలహీనవర్గాల అభివృద్ధే ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తుందని వివరించారు. కార్యక్రమంలో సొసైటీ నారాయణ, నర్రా పుల్లయ్య, డాక్టర్ కర్నాటి వరలక్ష్మి, డాక్టర్ విక్రాంత్, మాజీ సర్పంచి తమ్మిశెట్టి నరసింహారావు, వేముల తిరుమలకుమార్, కౌన్సిలర్ వేముల కృష్ణ, మాదినపాడు గ్రామస్తులు సాదినేని కోటేశ్వరరావు, బండారు పెదవీరయ్య, తదితరులున్నారు.

అర్హులందరికీ పథకాలు

- ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

వెల్దుర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కులం, మతం, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండలంలోని శ్రీరాంపురంతండాలో ఉచిత గ్యాస్ సిలిండర్లను శుక్రవారం ఆయన లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన పల్నాడుపై సీఎం చంద్రబాబుకు ప్రత్యేక దృష్టి ఉందని, ఇందులో భాగంగానే రాష్ట్రానికి 13 ప్రధాన రహదారులు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయగా వీటిలో 4 రహదారులు పల్నాడుకు కేటాయించారన్నారు. వీటిని సాధించడంలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కృషి ఎంతగానో ఉందన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. మాచర్లలో త్వరలోనే 100 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. ఎన్నో యేళ్లుగా ఎదురుచూస్తున్న వరికపూడిశెలను సాధిస్తామని, సాధించకుంటే రాజకీయాలు మాట్లాడనని అన్నారు. ప్రతి ఇంటికి కుళాయి ద్వారా మంచినీటిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పులుసు శివారెడ్డి, స్పెషలాఫీసర్ జగదీశ్వరరెడ్డి, ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దార్ బాషా, జనసేన మండల అధ్యక్షుడు మల్లయ్య, మాజీ సర్పంచ్ అంజినాయక్, మల్లయ్యనాయక్, గుజ్జుల పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్రరాష్ట్ర

అవతరణ దినోత్సవం

- పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళి

మాచర్ల రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌లోని కుడి జలవిద్యుత్ కేంద్రంలో శుక్రవారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఓఅండ్ఎం ఈఈ అప్పాజీ ఆధ్వర్యాన పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర అవతరణకు శ్రీరాములు చేసిన కృషిని కొనియాడారు. డిప్యుటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎండి అక్బర్, మోహన్‌బాబు, రాజారెడ్డి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు బి.శ్రీను, సల్మా, జూనియర్ ఇంజనీరు రాణి, ఐఎన్‌టీయూసీ యూనియన్ రీజనల్ సెక్రటరీ బి.సూరజ్‌చంద్, జెన్‌కో సెక్యూరిటీ హెడ్ గార్డ్ మహేష్, ఉద్యోగులు విజిత్, లక్ష్మీ, రమణ, వెంకటేశ్వర్లు, విజయ్, కొండ, రామకృష్ణ పాల్గొన్నారు.

కనకదుర్గ అమ్మవారికి

వెండి కవచాలు సమర్పణ

రెంటచింతల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలువాయి జంక్షన్‌లోని కనకదుర్గ అమ్మవారికి వెండి కవచాలను సమర్పించినట్లు ఆలయ చైర్మన్ ఏచూరి సాంబశివరావు, ప్రధాన పూజారి సాంబశివ శాస్త్రిలు తెలిపారు. మాచర్లకు చెందిన నర్రా దుర్గారెడ్డి, ప్రశాంతి దంపతులు రూ.1.50 లక్షలు విలువ చేసే ఈ వస్తువులను ఆలయానికి అందజేశారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి మొక్కిన మొక్కును నెరవేర్చుకున్నామన్నారు. సత్రశాలలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి వేద సీడ్స్ హైదరాబాద్ వారు 25 డస్ట్ బిన్స్ అందజేసినట్లు ఈవో గాదె రామిరెడ్డి తెలిపారు. శనివారం నుంచి సత్రశాలలో అన్నదానం ప్రారంభమవుతుందన్నారు.

కార్తీకమాస భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

అమరావతి, నవంబరు 1: శనివారం నుండి కార్తీక మాసం ప్రారంభం పురస్కరించుకుని పంచారామ పుణ్యక్షేత్రాలలో ప్రథమ ఆరామమైన బాలచాముండికా సమేత అమరేశ్వరాలయం దర్శించే భక్తులకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా స్నానఘాట్‌ల వద్ద గజ ఈతగాళ్ల ఏర్పాటు, స్త్రీలు బట్టలు మార్చుకునేందుకు గదులు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. ఆలయంలో క్యూలైన్‌లు, షామియానాలు, త్రాగునీటి సరఫరా , ప్రసాదాలు సిద్ధం చేశారు. ఆలయ ప్రధాన గాలిగోపురం, ప్రధాన ఆలయంపై విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేశారు. గాంధీబొమ్మ సెంటర్ వద్ద విద్యుత్‌దీపాలతో ముఖద్వారం ఏర్పాటు చేసి రహదారికి ఇరువైపుల విద్యుత్‌దీపాలతో తోరణాలు ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. స్వామివారిని దర్శించే భక్తులకు త్వరితగతిన దర్శనం జరిగేలా చర్యలు తీసుకున్నట్లు ఈఓ సునీల్‌కుమార్ తెలిపారు.



విద్యుత్ కాంతులతో ఆలయ స్వాగత ద్వారం



విద్యుత్‌దీపాల కాంతిలో ప్రధాన రాజగోపురం

తనిఖీలు నిరంతరం కొనసాగుతాయి

- క్రోసూరు ఏడీఏ హనుమంతరావు

ఫటాఫట్



వీ హనుమంతరావు
ఏడీఏ క్రోసూరు

క్రోసూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : క్రోసూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఐదు మండలాల్లో ఎరువులు, పురుగు మందుల దుకాణాల పై నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని క్రోసూరు ఏడీఏ హనుమంతరావు అన్నారు. ఆయనతో ఆంధ్రజ్యోతి ప్రతినిధి ఫటాఫట్ ..

ప్ర : ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ముగింపు దశకు వచ్చింది కదా, పంటల పరిస్థితి ఏంటి?

జ : సబ్ డివిజన్‌లో వాణిజ్య పంటలైన ప్రత్తి, మిర్చి, ఆహార పంట ఐన మాగాణి రైతులు ఎక్కువగా వేశారు. పంటల పరిస్థితి సంతృప్తిగా ఉంది. భారీ వర్షాల ప్రభావం ఇక్కడ పెద్దగా లేదు.

ప్ర : భూసార పరీక్షలు, ఈ క్రాపు నమోదు, ఈకేవైసీ, గుర్తింపు కార్డుల పంపిణీ వంటి వాటిల్లో లక్ష్యాన్ని చేరుకున్నారా?

జ : గుర్తింపు కార్డులు దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇచ్చాం. భూసార పరీక్షలు వంద శాతం, ఈ క్రాపు నమోదు, ఈకేవైసీ 95 శాతం సాధించాం.

ప్ర : అధిక ధరలకు విక్రయాలపై ఫిర్యాదుల మాటేమిటి?

జ : ఎరువులను అక్కడక్కడ ఎంఆర్‌పీ కన్నా ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని తమ దృష్టికి కూడా వచ్చింది. డీలర్లను అనేక సార్లు హెచ్చరించాం, స్టాక్ బోర్డులు, ధరల పట్టికలు తప్పనిసరిగా ప్రదర్శించాలని, లేక పోతే చర్యలు ఉంటాయని ఆదేశాలు జారీ చేశాం,

ప్ర : రానున్న రబీ సీజన్‌కు ఏ విధంగా సిద్ధ మవుతున్నారు?

జ : క్రోసూరు సబ్ డివిజన్‌లో రబీ సీజన్ పెద్దగా ఉండదు. మిర్చి వేశారు. అక్కడక్కడ వేరు శనగ, పొగాకు, మొక్క జొన్న, కంది పంటలు వేస్తారు. సబ్సిడీపై విత్తనాలు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నాం.

ప్ర : రైతులకు మీరిచ్చే సలహాలు, సూచనలు ఏమిటి?

జ : ప్రతి సోమ, మంగళవారాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించి రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల, నిపుణులచే సలహాలు ఇప్పిస్తున్నాం.

పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళి

రాజుపాలెం,నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన రాజుపాలెం మండల పరిషత్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, కూటమి నేతలతో కలసి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ ఆవరణంలో ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హస్పిటల్ గుంటూరు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, జనసేన మండల పార్టీ అధ్యక్షులు తోట నరసయ్య, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు నెల్లూరి అహల్యారాణి, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పూజల వెంకటకోటయ్య నేతలు తదితరులు ఉన్నారు.

సత్తెనపల్లి (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీ బొమ్మల సెంటర్‌లో శుక్రవారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అక్కడ ఉన్న పొట్టి శ్రీరాములు, జాతీయ నేతల విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యం. వెంకటేశ్వరరావు, బీ.కాశి, చౌట శ్రీనివాసరావు, మధుసూదనరావు, కాపుగంటి రత్తయ్య, కళ్యాణ్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మాచర్లటౌన్,(ఆంధ్రజ్యోతి): తన ప్రాణత్యాగంతో ఆంధ్ర రాష్ట్రానికి ఊపిరి పోసిన మహానుభావుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవంలో ఆయన పాల్గొని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, యెనుముల కేశవరెడ్డి, కజ్జం సైదయ్య, సూరె యలమంద, కంభంపాటి అనిల్‌కుమార్, శేషు, పోలా చిన సత్యం, నాగేశ్వరరావు, కొండలు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చంద్రకాంతుల దీపావళి

- ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



రెంటచింతల,నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల జగనాసుర పాలనను కూలదోసి కూటమికి ఘన విజయాన్ని అందించిన ప్రజలకు సీఎం చంద్రబాబునాయుడు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేసి ఈ దీపావళికి వారింట చంద్రకాంతులను ప్రసరింపచేశారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం రెంటచింతలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీపం పథకం ద్వారా సీఎం చంద్రబాబు మూడు సిలిండర్లను ఉచితంగా ఇవ్వడం వలన ఒక్కో కుటుంబానికి రూ. 2553లు లబ్ధి చేకూరుతుందన్నారు. ఇదివరకు విజన్ 2020 పేరుతో పరిపాలన సాగించిన సీఎం ఇప్పుడు 2047తో భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి ప్రణాళికలు రచిస్తున్నారన్నారు. గత ఐదేళ్ల పాలనలో మితిమీరిన అవినీతిని వెలికి తీసి బాధ్యులను శిక్షిస్తామని ఎమ్మెల్యే హెచ్చరించారు. దీపం పథకం ద్వారా రెంటచింతల మండలంలో 11853 కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నేతలు ఉన్నారు.

దీపం పథకంతో మహిళల మోములో ఆనందం

- మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్‌ల పంపిణీ

పెదకూరపాడు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తెలుగింటి ఆడపడుచుల కళ్లల్లో ఆనందం చూడటమే ప్రభుత్వ లక్ష్యమని మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమల్ల రమేష్ అన్నారు. పెదకూరపాడులో ఇండేన్ గ్యాస్ కార్యాలయం వద్ద ఉచిత గ్యాస్ పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సూచన మేరకు లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడిపూడి రాజు, తహసిల్దార్ మీసాల దానియేలు, ఎంపీడీవో రామకృష్ణ, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రాంగోపాలరావు, గల్లా బాబూరావు, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

నేడు క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

పెదకూరపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని గుజ్జనగుండ్ల సెంటరులో శనివారం ఉదయం 9 గంటలకు బుజ్జి బాక్స్ క్రికెట్ అకాడమీలో ఉదయం 9 గంటలకు బాల, బాలికల విభాగాలలో క్రికెట్ పోటీల క్రీడాకారుల ఎంపికలు జరుగుతాయని గుంటూరు జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ ఎం రవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ఈ సెలక్షన్స్ జరుగుతాయని వివరించారు. ఎంపికలకు వచ్చే క్రీడాకారులు వారి సొంత క్రికెట్ కిట్లతో సంబంధిత సర్టిఫికెట్లతో తాడికొండ ఎస్‌వీవీ హై స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్‌ను సంప్రదించాలని తెలిపారు. వివరాలకు 9866002288 ఫోన్ నెంబర్లు సంప్రదించవచ్చని ఆయన సూచించారు.



ఉచిత గ్యాస్ సిలిండర్‌లను లబ్ధిదారులకు అందిస్తున్న టీడీపీ నాయకులు

అచ్చంపేటలో ఉచిత గ్యాస్ పంపిణీ

అచ్చంపేట నవంబరు 1 (ఆంధ్రజోతి): కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల అమలులో భాగంగా గురువారం ఉచిత గ్యాస్ సిలిండర్‌లను పంపిణీ చేసింది. మండలంలో 14,786 గ్యాస్ కనెక్షన్‌లు ఉండగా వీటిలో తాడువాయి, చల్లగరిగ, మాదిపాడు పరిదిలో 2,500 కనెక్షలు ఉన్నాయి. మిగిలిన అన్ని గ్రామాలలో 12,286 కనెక్షన్‌లు ఉన్నాయి. ఇప్పటి వరకూ అచ్చంపేటలో 1,125 ఉచిత గ్యాస్‌లు నమోదు చేసుకున్నారు. తాడువాయి పరిదిలో 130 నమోదు అయ్యాయి. శుక్రవారం అచ్చంపేట టీడీపీ నేతలు పలువురికి ఉచితంగా గ్యాస్ అందజేసి పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, చల్లా రమేష్, సందెపోగు శామ్యేల్, తిరువాయి పాటి ఆంజనేయులు, బత్తుల కోటేశ్వరరావు, అయ్యప్పరాజు, షేక్ మాభూవలి తదితరులు పాల్గొన్నారు.



ఎండీయూ వాహనంలో బియ్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

రేషన్ బియ్యం పక్కదారి

- తహసీల్దార్ రాకతో ఎండీయూ ఆపరేటర్ పరార్
- 450కేజీలు (తొమ్మిది బస్తాలు) వ్యత్యాసం
- విచారణ అనంతరం చర్యలు చేపడతామన్న తహసీల్దార్
- పేదల రేషన్ బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తెనాలి రూరల్, నవంబరు 01(ఆంధ్రజ్యోతి): పేదలకు రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసే విధానాన్ని పరిశీలించేందుకు వచ్చిన తహసీల్దార్ రాకను గమనించి ఎండీయూ (రేషన్ పంపిణీ వాహనం) ఆపరేటర్ స్టాక్‌ను విడిచి పరారయిన సంఘటన తెనాలిలో చోటుచేసుకుంది. శుక్రవారం నుండి కార్డు దారులకు రేషన్ బియ్యం పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. దీంతో పేదలకు ప్రభుత్వం అందించే రేషన్ సరుకులు లబ్ధిదారులకు చేరువచేసే విధానాన్ని మండల తహసీల్దార్ గోపాలకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంపిణీ ప్రారంభమైన గంట వ్యవధిలోనే చినరావూరు 08నెంబరు ఎండీయూ వాహనంలో సుమారు 9 బస్తాల్లో కేజీలు 450 బియ్యాన్ని అధికంగా ఉన్నట్లు గుర్తించారు. దీనిపై ఆపరేటర్‌ను ప్రశ్నించేందుకు ప్రయత్నించగా అప్పటికే వాహనాన్ని విడిచిపెట్టి ఆపరేటర్ వెళ్లిపోయాడు. అనంతరం అదే ప్రాంతంలో రేషన్ డీలర్ పాయింట్‌ను సందర్శించి స్టాక్ వ్యత్యాసంపై వివరణ ఇవ్వాలని తహసీల్దార్ ఆదేశించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ పేదలు ఆకలితో ఉండకూడదన్న సదుద్దేశంతో ప్రభుత్వం కేజీ రూ.46 బియ్యాన్ని కొనుగోలు చేసి రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు అందిస్తుందని చెప్పారు. అయితే కొందరు దళారులు ఆ బియ్యంపై లేని పోని అపోహలు కల్పించి లబ్ధిదారులు వాటిని వాడకుండా కేజీ రూ.8 నుండి 12 వరకూ కార్డు దారులకు చెల్లించి కొనుగోలు చేస్తూ నల్లబజార్లకు తరలిస్తున్నారని చెప్పారు. దీని ద్వారా కార్డుదారుడు తీవ్రంగా నష్టపోతున్నారని గుర్తించాలన్నారు.ప్రభుత్వం పేదలు సద్వినియోగం చేసుకునేలా ఆహార భద్రతా నియమాలను పాటిస్తూ నాణ్యమైన బియ్యాన్ని ఇస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొందరు ఎండీయూ ఆపరేటర్లు ప్రభుత్వ ఆశయాన్ని నీరు గార్చేలా వ్యవహరిస్తున్నారని నిబంధనలను అతిక్రమిస్తే ఉపేక్షించేదిలేదన్నారు. స్టాక్ వ్యత్యాసం గుర్తించిన ఎండీయూ ఆపరేటర్‌పై విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. రేషన్ పంపిణీపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని నిర్ణీత సమయంలోపు లబ్ధిదారులకు రేషన్ పంపిణీ ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు. సీఎస్‌డీటీ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మండల వనరుల కేంద్రం చుట్టూ చేరిన మురుగు నీరు

మురుగు నీటితో అవస్థలు

- పట్టించుకోని అధికారులు

ఈపూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ మురుగు నీరు చేరడంతో అక్కడ దుర్వాసన వస్తుంది. కార్యాలయాలకు వచ్చే వారు అధికారులు అవస్థలు పడుచున్నారు. ఈపూరు మండల వనరుల కేంద్రం చుట్టూ నీరు చేరి చిన్న సైజు తటాకాలను తలపిస్తున్నాయి. ఆ దారి లో సచివాలయంకు ,ఎమ్మార్సీ కి వెళ్ళాలంటే నీటిలో దిగాల్సిందే. అంతే కాకుండా చుట్టూ పిచ్చి చెట్లు అల్లుకు పోతుండడంతో విషసర్పాలు కార్యాలయంలో చొరబతున్నాయని అక్కడ పని చేసే సిబ్బంది భయాంతోళనకు గురౌచున్నారు. ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ ఆక్రమణలు జరగడంతో మురుగునీరు వెళ్ళే దారిలేక పోవడంతో అక్కడ మురుగుచేరి కుంటను తలపిస్తుంది. ఆ మురుగుకుంట నుండి దుర్వాసన వెదజల్లుతుండడంతో కార్యాలయాలకు పనుల మీద వచ్చే వారు ఇబ్బంది పడుచున్నారు. అధికారులు స్పందించి నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుచున్నారు.



ఎంపీడీవో కార్యాలయం వద్ద మురుగుకుంట



సూర్యలంక సముద్రతీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తజనం

కార్తీకానికి సూర్యలంక సిద్ధం

- భక్తుల తాకిడికి తగ్గట్లు ఏర్పాట్లలో విఫలం
- తాత్కాలిక వసతులతో సరిపెట్టనున్న అధికారులు



తీరంలో దాతల సహకారంతో నిర్మించిన పోలీసు వాచ్‌టవర్




సూర్యలంక తీరంలోని చాలిచాలని స్నానాల గదులు

బాపట్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పడి లేచే సముద్రకెరటాలు.. ఇసుక తిన్నెలు.. తెరచాప పడవలు, కన్యాకుమారిని తలపించేలా సూర్యోదయంతో, బాపట్ల సూర్యలంక తీరప్రాంతం. పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తూ ఆంధ్ర గోవాగా ప్రసిద్ధి చెందింది. కార్తీకమాసంలో ఇక్కడకు పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఇంతటి ప్రసిద్ధిగాంచిన సూర్యలంక తీరంలో మాత్రం భక్తులకు, పర్యాటకులకు కావాల్సిన వసతులు కల్పించలేకపోయారు. కేవలం వ్యాపార సముదాయాలు పెంచుకోవటమే కాని భక్తుల అవసరాలను మాత్రం గుర్తించి తగిన వసతులు కల్పించటంలో పాలకులు విఫలమయ్యారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది పర్యాటకుల తాకిడి మరింత పెరిగే అవకాశం ఉందనే అంచనాలతో, ఇప్పటికే సమీక్షలు జరిపారు. భక్తులకు కావాల్సిన తాత్కాలిక వసతులు ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. ఏటా తాత్కాలిక వసతులు మినహా, శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కానరావడం లేదు. వైసీపీ పాలనలో అప్పటి రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా రెండు సార్లు ఇక్కడకు వచ్చి పరిశీలించి అభివృద్ధి చేస్తామంటూ ఇచ్చిన హామీలు కాస్తా నీటి మూటలాగనే మిగిలిపోయాయి. సముద్రంలో జరుగుతున్న ప్రమాదాలను పసిగట్టేందుకు పోలీసు అధికారులు మాత్రం దాతల సహకారంతో మూడు వాచ్‌టవర్‌లు నిర్మించారు. మంతెన దశరథమహరాజు దాతల సహకారంతో తీరంలో శివాలయం నిర్మించారు. ఈరెండు మినహా ఇక్కడ జరిగిన అభివృద్ధి శూన్యమని చెప్పవచ్చు. గతంలో మాజీ ఎమ్మెల్యే ముప్పలనేని శేషగిరిరావు పర్యాటకులు, భక్తుల కోసం దుస్తులు మార్చుకునేందుకు రెండు భవనాలను నిర్మించారు. వైసీపీ పాలనలో పాలకులు అభివృద్ధి పేరిట వాటిని తొలిగించి ఎలాంటి వసతులు కల్పించలేకపోయారు.



సూర్యలంక తీరంలో దాతలు నిర్మించిన శివాలయం.



తీరంలో తొలగించిన పర్యాటకులు దుస్తులు మార్చుకునే భవనాలు.

ప్రభుత్వం నుంచి నిధులు నిల్..

లక్షలాది మంది భక్తులొచ్చే ఈప్రాంతంలో కేవలం నాలుగు స్నానాలు గదులు మాత్రమే ఉన్నాయి. వీటిని కూడా వేలంపాట పెట్టి పంచాయతీవారు ఆదాయం సమకూర్చుకుంటూ మెరుగైన వసతులు కల్పించలేకపోతున్నారు. తీరానికి వచ్చే వాహనాల పార్కింగ్, స్నానాల గదుల ఆశీలు వసూళ్లకు పంచాయతీ వేలం ద్వారా, 36.06 లక్షల రూపాయల ఆదాయం వచ్చింది. తీరంలో ఉన్న 38షాపుల ద్వారా 11.40 లక్షల రూపాయలు ఆదాయం వస్తుంది. అయితే గజఈతగాళ్ళు, పారిశుధ్య కార్మికులకు ఈ ఆదాయం నుంచే వేతనాలు చెల్లిస్తున్నారు. పారిశుధ్య సామగ్రి, విద్యుత్తు, ఇతర అవసరాలకు కూడా ఈడబ్బులే ఉపయోగిస్తున్నారు. ప్రభుత్వంనుంచి ఎటువంటి అదనపు నిధులు రావటంలేదని అధికారులు పేర్కొంటున్నారు. దీనివల్ల పంచాయతీ ద్వారా వచ్చే ఆదాయం కాస్తా ఇతర అవసరాలకు వినియోగించాల్సి రావడంతో, భక్తులకు వసతులు కల్పించటంలో విఫలమవుతున్నారు.

నరసరావుపేట టీడీపీలో

కోడెల విగ్రహం చిచ్చు

- నానాటికి ముదురుతున్న వివాదం
- తొలగించిన చోటే విగ్రహం ఏర్పాటు చేయాలన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- విగ్రహం తొలగింపుపై అధిష్టానం ఆరా
- అధికారులను తప్పుపడుతున్న ఎమ్మెల్యే అరవిందబాబు వర్గం

నరసరావుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నరసరావుపేట టీడీపీ లో నవ్యాంధ్రప్రదేశ్ తొలి శాసన సభాపతి డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు విగ్రహం తొలగింపు వివాదం రోజురోజుకు ముదురుతోంది. పార్టీలో కోడెల విగ్రహం చిచ్చు రాజు కుంది. తొలగించినచోటే విగ్రహం ఏర్పాటు చేయాలనే వారి సంఖ్య పార్టీలో పెరుగుతోంది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు కూడా తొలగించిన చోటే కోడెల విగ్రహం ఏర్పాటు చేయాలని శుక్రవారం సూచించారు. విగ్రహం వివాదం ఎమ్మెల్యే అరవిందబాబుకు చుట్టుకుంటోంది. విగ్రహం తొలగింపు తనకు తెలియదని ఆయన ఖండిస్తున్నా పార్టీలో నేతలు అయన వాదనను వినే పరిస్థితి లేదు.

నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహంను అయన వర్ధంతి సదర్భంగా అభిమానులు ఏర్పాటు చేశారు. అయితే విగ్రహావిష్కరణను ఆప్పత్రి వర్గాలు అడ్డుకున్నాయి. ఇంతటితో ఆగక విగ్రహంను రాత్రికి రాత్రే తొలగించి వేశారు. ఈ సంఘటన గత నెల 28న వెలుగుచూసింది. విగ్రహం తొలగింపును అయన అభిమానులు, పార్టీ శ్రేణులు జీర్ణించుకొ లేకపోతున్నాయి. విగ్రహం తొలగింపు సందర్భంలో ఆయన అభిమానులు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రునాయక్ ఛాంబర్‌లో ఆందోళన చేపట్టడం.. ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు ఆదేశాల మేరకే విగ్రహం తొలగించామని అయన ప్రకటించిన విషయం తెలిసిందే. తొలగించిన విగ్రహం కూడా ఎక్కడ పడవేశారో అధికారులు చెప్పకపోతుండటం మరింత వివాదానికి దారితీస్తోంది. సంఘటన వెలుగులోకి వచ్చినప్పటి నుంచి ఎమ్మెల్యే అరవిందబాబు ప్రతి మీటింగ్‌లో విగ్రహం తొలగింపు తనకు తెలియదని చెబుతున్నారు.



తొలగించిన కోడెల విగ్రహం, పగలుకొట్టిన విగ్రహం ఉన్న దిమ్మె

ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకుంటామని పేర్కొంటున్నారు. కోడెలకు సముచిత గౌరవం కల్పించే రీతిలో అయన స్మృతి వనం నిర్మించి విగ్రహం ఏర్పాటు చేస్తామంటు న్నారు. అయినా తొలగించిన విగ్రహం ఏర్పాటు చేయాల్సిందేనన్న డిమాండ్ చేసేవారి సంఖ్య పెరుగుతోంది. ఇది అరవిందబాబుకు తలనొప్పిగా పరిణమించింది. తొలగించిన విగ్రహం ఏర్పాటు చేయాల్సిందేనని అయన అభిమానులు కోరుతున్నారు. కోడెలవిగ్రహం తొలగింపుపై పార్టీ అధి ష్టానం కూడా దృష్టి సారించనట్లు నేతలు చెబుతున్నారు. విగ్రహం ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తానని జిల్లా పార్టీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ హామి ఇచ్చారని కోడెల అభిమానులు చెబుతున్నారు. కోడెల విగ్రహం తొలగింపుపై జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ దృష్టికి పార్టీ నేతలు తీసుకువెళ్లారు.



సూపరింటెండెంట్ కార్యాలయంలో కోడెల అభిమానుల ఆందోళన (ఫైల్)

కోడెల విగ్రహం తొలగించడంతో చాలా బాధపడ్డాను : స్పీకర్ అయ్యన్న

నరసరావుపేటలో కోడెల శివప్రసాదరావు విగ్రహం తొలగించిన సంఘటనతో తాను చాలా బాధపడ్డానని స్పీకర్ అయ్యన్న పాత్రుడు అన్నారు. కోడెల అంటే ఒక చరిత్ర అని పేర్కొన్నారు. కోడెల రాజకీయాల్లోకి రాక ముందు నరసరావుపేట చాలా చిన్న పట్టణం అలాంటి పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేసి ఆయన ప్రజల మన్ననలు పొందారు. 2014- 2019లో నరసరావుపేట అభివృద్ధికి కోట్ల రూపాయాలు ప్రభుత్వం నిధులు ఖర్చు ఎంతో అభివృద్ధి చేశారు. కోడెల ఎన్‌టీఆర్‌కు ఎంతో సన్నిహితంగా ఉండే వారు. నరసరావుపేట ఆస్పత్రిని బ్రహ్మాండంగా అభివృద్ధి చేశారు. అటువంటి ఆస్పత్రిలో కోడెల విగ్రహం ఏర్పాటుచేస్తే తప్పు ఏముంది. ఆస్పత్రిని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసిన కోడెల విగ్రహం ఏర్పాటుచేస్తే ఆ విగ్రహం తొలగించారు. వారికి బుద్ధి ఉండాలి కదా. కోడెల అంటే ఓ శక్తి. ఆయన విగ్రహం తీసేసి ఆయనను అవమానించారు. విగ్రహాన్ని తిరిగి అదేస్థానంలో ఏర్పాటు చేసి కోడెలనుగౌరవించాల్సి అవసరం అధికారులు, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని నాయకులపై ఉందన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన ఈ వ్యాఖ్యలు పార్టీలో సంచలనం కలిగించాయి.

నేడు ప్రపంచ బ్యాంకు

ప్రతినిధుల బృందం సమావేశం

తుళ్లూరు, నవంబరు 1: (ఆంధ్రజ్యోతి): ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం శనివారం మండల కేంద్రం తుళ్లూరులోని హెచ్ఎస్ఆర్ కళ్యాణ మండపంలో సమావేశం కానుంది. పర్యావరణం, సామాజిక వ్యవస్థల మదింపు ముసాయిదాపై స్థానిక ప్రజానీకంతో సంప్రందింపులు చేసే కార్యక్రమం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2.30 గంటల నుండి 5గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని సీఆర్డీఏ అధికారులు శుక్రవారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. రాజధాని అమరావతి నగర అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈసమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

తెనాలి క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగడానికి డబ్బు ఇవ్వలేదని తల్లిదండ్రుల ముందే యువకుడు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చినరావూరులో చోటు చేసుకుంది. వన్ టౌన్ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు చినరావూరుకు చెందిన గౌస్ ఖాజా మద్యానికి బానిస అయ్యాడు. తరచూ మద్యం సేవించి డబ్బుల కోసం తల్లిదండ్రులను వేధింపులకు గురి చేస్తుంటాడు. గురువారం అర్థరాత్రి సమయంలో మద్యం తాగడానికి డబ్బు కావాలంటూ తల్లిదండ్రులను వేధించసాగాడు. ఎంతకు తల్లిదండ్రులు డబ్బులు ఇవ్వకపోవడంతో వారిని బెదిరించడానికి ఆత్మహత్య చేసుకుంటానంటూ గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. కొద్దిసేపటికి తల్లిదండ్రులు తలుపులు పగలగొట్టి చూడగా ఖాజా అప్పటికే చీరతో ఫ్యాన్‌కి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు.

రెస్టారెంట్‌పై రౌడీషీటర్ దాడి

- ఎమ్మెల్యేతో మాట్లాడండి.. లేకుంటే వ్యాపారం జరగదు
- బార్ నిర్వాహకులను హెచ్చరించిన దుండగులు
- తనకు ఏ సంబంధం లేదన్న ఎమ్మెల్యే అరవిందబాబు
- పోలీసులకు ఫిర్యాదు.. ఎట్టకేలకు అరెస్టు

నరసరావుపేట లీగల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రౌడీషీటర్, టీడీపీ అధికార ప్రతినిధి చల్లా సుబ్బారావు గురువారం రాత్రి తన అనుచరులతో వినుకొండ రోడ్డులోని బార్‌వన్ రెస్టారెంట్‌పై దాడిచేసి భయోత్పాత వాతావరణం సృష్టించారు. భయపడిన బార్ నిర్వాహకులు రెండవ పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు కూడా ఈ రౌడీ మూక అరచాకాన్ని వీక్షించారేకాని ఏవిధమైన చర్యలు తీసుకోలేక పోయారు. దాడి చేస్తున్న సమయంలో నిర్వాహకులను ఎమ్మెల్యేతో మాట్లాడమని, లేని పక్షంలో వ్యాపారం నిర్వహించుకోలేరని తనకు తానే ఎమ్మెల్యేకి సంబంధం లేకపోయినా ప్రగల్భాలు పలుకుతూ దాడి చేశారు. నిర్వాహకులు పోకా శ్రీనివాసరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాము బార్ లైసెన్స్‌ల కోసం రూ 2.90 కోట్లు వెచ్చించి 145 దరఖాస్తులు చేసి ఐదుషాపులు దక్కించుకున్నామన్నారు. అయినప్పటికీ అధికారపక్ష నాయకులు వేధింపులు భరించలేక ఒప్పందంలో భాగంగా ఒక షాపును ఇచ్చేశామన్నారు. ఐనా కూడా వ్యాపారంలో ఓ స్థాయిలో ఉన్న తమ పట్ల టీడీపీకి చెందిన వారు బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇక పట్టణంలోని సామాన్య వర్తకుల పరిస్థితి ఏవిధంగా ఉంటుందో తలచుకుంటేనే భయం వేస్తుందన్నారు. ఈ విషయాన్ని శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు దృష్టికి తీసువెళ్ళారు. ఆయన సూచనల మేరకు రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రధాన నిందితుడు రౌడీషీటర్ చల్లా సుబ్బారావును అరెస్ట్ చేసినట్లు రెండవ పట్టణ సీఐ హైమారావు తెలిపారు. మిగతా నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయన్నారు. కాగా ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు ఈ ఘటనతో తనకు ఎటువంటి సంబంధం లేదన్నారు. చట్టాన్ని ఉల్లఘించి ప్రవర్తించే వారిపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

పింఛన్ నగదుతో అధికారి పరారు

- గతంలోనూ ఒక సారి ఇదే పరిస్థితి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎంపీడీవో

గురజాల టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గతంలో ప్రభుత్వ, రైతుల సొమ్ము కాజేసిన ఓ ఉద్యోగికి అధికారులు అండగా నిలిచారు.. గుట్టుచప్పుడు కాకుండా పరిస్థితిని చక్కబెట్టారు. అయితే ఆ ఉద్యోగి మాత్రం తన తీరు మార్చుకోలేదు. మళ్లీ ప్రభుత్వ సొమ్ముపై కన్నేశాడు. ఈసారి పింఛన్ నగదుతో పరారయ్యాడు. దీంతో అధికారులు కంగుతిన్నారు..

రూ. 2.30 లక్షల పింఛన్ డబ్బుతో..

గురజాల మండలంలోని తేలుకుట్ల సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా మండలంలోని పులిపాడుకు చెందిన బత్తుల వెంకట నారాయణ విధులు నిర్వహిస్తున్నారు. తేలుకుట్ల గ్రామంలోని 9, 13 క్లస్టర్ల పరిధిలో 55 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరికి రూ. 2.30 లక్షల దాకా పింఛన్ అందించాల్సి ఉంది. కాగా గత నెల 30వ తేదీన బ్యాంకు నుంచి వెల్ఫేర్ అసిస్టెంట్ డబ్బులు తీసుకొచ్చి వెంకటనారాయణకు అందించారు. 1వ తేదీన ఉదయం 6 గంటల నుంచి పింఛన్ అందించాల్సి ఉండగా 8 గంటలు దాటినా పింఛన్ అందించలేదు. సచివాలయంలో వెంకటనారాయణ అందుబాటులో లేకపోవడంతో అతని స్వగ్రామమైన పులిపాడుకు పంచాయతీ సెక్రటరీ సుబ్బారావు వెళ్లారు. వెంకటనారాయణ గృహానికి చేరుకొని తలుపు కొట్టగా ఎంతసేపటికీ తలుపులు తీయలేదు. దీంతో సుబ్బారావు అధికారులకు ఫోన్లు చేస్తుండగా వెంకటనారాయణ పరారైనట్లు సమాచారం. జరిగిన సంఘటనను పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు ఫోన్ ద్వారా ఎంపీడీవో గౌసియా బేగంకు తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు ఎంపీడీవో గౌసియా బేగం తెలిపారు. వెంకటనారాయణపై పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు. గతంలోనూ వెంకటనారాయణపై పలు ఆరోపణలు ఉన్నాయి. ఎరువులు సరఫరా నగదు రూ.4 లక్షలు, రైతులకు సంబంధించిన నగదు రూ. 6 లక్షలు దాకా వెంకటనారాయణ కాజేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని బయటకు పొక్కనీయకుండా అధికారులు అండగా నిలిచి సద్దుమణిగించినట్లు విశ్వసనీయ సమాచారం.

అంగన్‌వాడీ కార్యకర్తకు ఛార్జ్‌మెమో

గుంటూరు సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తాడికొండ మండలం లాం గ్రామంలో సామాజిక పింఛన్‌దారులను అంగన్‌వాడీ కేంద్రానికి పిలిపించి పంపిణీ చేసిన కార్యకర్తపై జిల్లా అధికారులు సీరియస్ అయ్యారు. శనివారం లాం అంగన్‌వాడీ కార్యకర్త సామ్రాజ్యంకు ఛార్జ్ మెమో జారీ చేశారు. ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేయాలని ప్రభుత్వం చెబుతుండగా గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త సామ్రాజ్యం లబ్ధిదారులను తన వద్దకు పిలిపించి పంపిణీ చేసినట్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. దానిపై విచారణ జరిపి సదరు కార్యకర్తపై చర్యలకు ఆదేశించినట్లు కలెక్టర్ కార్యాలయం తెలిపింది. జిల్లాలో నవంబరు 1వ తేదేనే 95 శాతం పింఛన్లు అందజేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని 17 మండలాలు,4 పట్టణాల్లో 2,58,053 మందికి రూ.109.84 కోట్ల పింఛన్లు కింద నిధులు విడుదల అయ్యాయి. 2వ తేదీ కూడా మిగిలిన లబ్ధిదారులకు పింఛన్లు అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

YouTuber

వినోదం.. సందేశం అన్నీ.. అర నిమిషంలోనే !

వేడి వేడి అన్నంలో టమాటా పప్పు.. రోటి పచ్చడి.. నెయ్యి వేసుకొని తింటే ఎంత సంతృప్తి కలుగుతుందో మల్లాది దుర్గా మల్లేష్ షార్ట్ వీడియోలు చూస్తే అదే అనుభూతి కలుగుతుంది. అందులో అశ్లీలత ఉండదు. ప్రమోషన్‌లు అసలే ఉండవు. కుటుంబమంతా కూర్చుని సినిమా చూసినట్లుగా చక్కగా చూడవచ్చు. కేవలం రెండేళ్లలో సుమారు 7 లక్షల మంది సబ్ స్క్రైబర్ లు. 22 కోట్ల వీక్షణలు. లక్షల్లో ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఫాలోయర్స్. ఇదీ గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన యూట్యూబర్ మల్లాది దుర్గా మల్లేష్ ప్రస్థానం..

గుంటూరు సిటీ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి):

గుంటూరు జిల్లా మంగళగిరి కి చెందిన మల్లాది దుర్గా మల్లేష్ అంటే కొత్తగా యూట్యూబ్ లో అడుగుపెట్టే వారికి ఒక ఐకాన్. నేటి స్మార్ట్ ఫోన్.. యూట్యూబ్ ప్రపంచంలో తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్న మల్లేష్ ప్రస్థానం గురించి తన మాటల్లోనే..

నేను పెద్దగా చదువుకోలేదు. కానీ కథలు రాయటం అంటే ఎనలేని ఆసక్తి.2010 నుండి కథలు రాస్తూనే ఉన్నా. వాటిని మా స్నేహితులతో కలిసి షార్ట్ ఫిల్మ్ లా తీసేవాళ్ళం. కానీ అవి చాలా మంది కి చేరేవి కావు.యూట్యూబ్ వచ్చాక కొన్ని వీడియోలు చూస్తుంటే వ్యూస్ కోసం అశ్లీలత, బూతులు ఇలాంటి వాటిని చూసి ఫ్యామిలీ సందేశంతో చేస్తే ఎలా ఉంటుంది అన్న ఆలోచన వచ్చింది.ఫ్యామిలీ కి సంబంధించినవి చేస్తే ఎవరు చూస్తారని చాలా మంది నిరుత్సాహ పరిచారు.కానీ నేను అటువంటి మార్గం లోనే వెళ్లాలని నిర్ణయించుకున్నా. 2022 జూన్‌లో మల్లాది దుర్గా మల్లేష్ అనే పేరు తో యూట్యూబ్ ఛానల్ మొదలు పెట్టా. నా వీడియోలన్నీ కుటుంబ విలువలు బోధించేవే. ఒక తండ్రి పిల్లలతో ఎలా ఉండాలి.. పిల్లలు తండ్రి తో ఎలా ఉండాలి.. అలాగే భర్త భార్య తో..భార్య భర్త తో ఎలా ఉండాలి అనే విషయాల చుట్టూ తిరుగుతూ ఉంటాయి.నా భార్య, పిల్లలు అందరూ నా వీడియో ల్లో హీరోలు, హీరోయిన్‌లు.



దుర్గా మల్లేష్

ప్రారంభంలో అనుభవాలు ..

వీడికేమి పోయే కాలం.. సంప్రదాయబద్ధమైన కుటుంబ లో పుట్టి ఇవేం పాడుపనులు..హవ్వ.. వేదం నేర్పిన నోట.. ఈ మాటలు ఏమిటీ.. ఈ యాక్షన్ లు ఏమిటీ... మొదట్లో ఇలా ఎవరి నోటికి వచ్చినట్లు వాళ్ళు మాట్లాడారు.యూట్యూబ్ వీడియోలు చేస్తున్నానని ఊరి వాళ్ళ గోల తట్టుకోలేక మా నాన్న కూడా మాట్లాడటం మానేశాడు.నాలుగు రోజులు నాతో అసలు మాట్లాడలేదు. ఆయన కు ఇష్టం లేని పని ఎందుకు చేయాలని నేను కూడా ఫోన్ పక్కన పడేశా. అప్పటికే దుర్గమ్మ తల్లి మహత్యం మీద చేసిన వీడియో బాగా వైరల్ అయ్యింది. ఆ వీడియోని రెండు కోట్ల మంది చూశారు. మా నాన్న స్నేహితులు చాలా మంది దాన్ని వాట్సాప్‌స్టేటస్ గా పెట్టుకున్నారు. భోజనం చేస్తూ దాన్ని చూసిన నాన్న నా దగ్గరకు వచ్చి శభాష్ రా..అన్నాడు.నాకు అర్థం కాలేదు. ఆ తర్వాత అదే వీడియో ఆయన స్టేటస్ లో పెట్టుకున్నారు. సక్సెస్ వచ్చిన తరువాత మొదట్లో తప్పు గా మాట్లాడిన వాళ్ళంతా నోటి మీద వేలేసుకున్నారు.



యూట్యూబ్ మేకింగ్ వీడియోలో మల్లేష్ కుటుంబం

ఒక వీడియోకి ఎంత సమయం పడుతుంది

మేము తీసే వీడియో నిడివి కేవలం అర నిముషం మాత్రమే. కానీ దాన్ని మంచి సందేశం తో తీయటానికి సుమారు నాలుగైదు గంటలు పడుతుంది. కానీ నేను వారానికి రెండు రోజులు మాత్రమే వీడియో లు చేస్తా. ప్రతి బుధవారం, ఆదివారం మాత్రమే. మిగిలిన రోజుల్లో వాటి జోలి అసలు పోము. మంగళగిరి పానకాల స్వామి గుడి వద్ద ఉన్న పూజా సామాగ్రి షాపును చూసుకుంటా.

యూట్యూబ్ వల్ల గుర్తింపు..

ఒకప్పుడు నాది చాలా చిన్న కుటుంబం.కానీ ఇప్పుడు నాది లక్షలాది మంది కలిగిన కుటుంబం. నన్ను అభిమానించే వాళ్ళు. నేను అభిమానించే వాళ్ళు.ఏ కష్టం వచ్చినా ఒకరికి ఒకరంఅంటూ స్పందిస్తూ ఉంటే .ఇదంతా కేవలం యూట్యూబ్ ఫ్లాట్ ఫారం వల్లే.ఎక్కడో ఉన్న వాళ్ళ ను ఒక కుటుంబం గా చేసింది. చాలా మందికి ఇబ్బందులు వచ్చాయి.నేను ఒక్కడినే కాదు. వాళ్ళ కోసం మా కుటుంబంలో చాలామంది స్పందించారు. మాకు చేతనైనంత చేశాను. మెదక్ జిల్లాకు చెందిన ఒక సబ్ స్క్రైబర్ రైతు.ట్రాక్టర్ మీద నుంచి కింద పడి చేయి విరిగింది. ఫోన్ చేశాడు. అందరం అంతో ఇంతో సహాయం చేశాం. కరోనా వచ్చి క్వారంటైన్ కి వెళ్లి వాళ్ళు మానసికంగా కుంగిపోకుండా ఉండేందుకు గంటకు ఒకరి చొప్పున వాళ్ళ కి ఫోన్ చేసి మాట్లాడే వాళ్ళం.

ప్రమోషన్ వీడియోలు చేస్తారా..

డబ్బు సంపాదన కు నేను వ్యతిరేకం.చాలా మంది వస్తారు ప్రమోషన్ వీడియో లు చేయమని. అలా చేస్తే నెలకు లక్షల్లో ఆదాయం వస్తుంది. నాకు అది ఇష్టం లేదు. నేను చేస్తున్న వీడియో లకు యూట్యూబ్ నుంచి ఎంతో కొంత వస్తుంది. అది చాలు నాకు.

4న మెగా జాబ్‌మేళా

నరసరావుపేట కల్చరల్, నవంబరు, 1: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ ఆధ్వర్యంలో ఈ నెల 4న మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లింగంగుంట్లలోని న్యాక్ సెంటర్‌లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే మేళాలో 3కంపెనీలు పాల్గొంటాయన్నారు. వివరాలలకు యం.వీ రాంజనేయులు (9160200652), ఏ.రమ్య (77029 21219) సంప్రదించాలని కోరారు.



మహిళ అనుమానాస్పద మృతి

ఈపూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని ఇనుమెళ్ళలో జరిగింది. గ్రామానికి చెందిన చెవల సుబ్బారావు భార్య భూలక్ష్మి (35) ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి బంధువులు, పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం సుబ్బారావుకు పిడుగురాళ్ళకు చెందిన బత్తుల నరసింహారావు కుమార్తె భూలక్ష్మితో 15సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు. గతకొంత కాలంగా ఇంట్లో తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి. బుధవారం కూడా భూలక్ష్మితో మరుదులు, మామ గొడవపడ్డారు. అనంతరం భూలక్ష్మి ఆత్మహత్య చేసుకుందని, దీనిపై పలు అనుమానాలు ఉన్నాయంటూ మృతురాలి తండ్రి బత్తుల నరసింహారావు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ ఎం.ఉమహేశ్వరరావు తెలిపారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు బైకులు ఢీ.. ఒకరి మృతి

చిలకలూరిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో టీడీపీ ఆఫీసుకు సమీపంలో గురువారం అర్థరాత్రి ప్రాంతంలో రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో పట్టణంలోని భావనారుషినగర్‌కు చెందిన కుమ్మరిగుంట లీలాకృష్ణ (30) అనే యువకుడు మృతిచెందాడు. మరో ముగ్గురికి స్వల్పంగా గాయాలయ్యాయి. వీరు బైక్‌పై పక్కనే ఉన్న ఒక రెస్టారెంట్‌లోకి వెళుతున్న సందర్భంలో ఎదురుగా వచ్చిన మరొక బైక్ వీరిని ఢీకొన్నది. గాయపడిన వారిని చికిత్సకోసం చిలకలూరిపేట, నరసరావుపేటలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. అర్బన్ ఎస్ఐ చెన్నకేశవులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు గుండె వైద్య శిబిరం

చిలకలూరిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక నరసరావుపేట రోడ్‌లోని రోటరీ కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 3వ తేదీన ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్ కార్యదర్శి ఉప్పుటూరి ప్రసాద్, మెడికల్ డైరెక్టర్ పూసల శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఇతర వివరాలకు హరిదాసుల శ్రీనివాసరావు సెల్ నెంబర్ 98660 43173, పి వినయ్ 94906 30396 కి సంప్రదించవచ్చునని చెప్పారు.

తైక్వాండోలో జాతీయస్థాయి పోటీలకు ఎస్ఎస్ఎన్ విద్యార్థి ఎంపిక

నరసరావుపేట టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ 2024లో ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థి వీ లక్ష్మీతులసీతన్మయ్ బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని పీడీ వై మధుసూధనరావు శుక్రవారం తెలిపారు. మరో విద్యార్థి ఆర్‌వీ బాలాజీ నాయక్ కాంస్య పతకం సాధించారన్నారు. తెనాలి శ్రీలక్ష్మి నరసింహా సోమయాజీ వైశ్య వ్యాయామ మందిర్‌లో జరిగిన 4వ రాష్ట్ర స్థాయిలో సీనియర్స్ టైక్వాండో చాంపియన్‌షిప్‌లో ఈ ఘనత సాధించారు.

అంజిరెడ్డి వైద్యశాలలో క్లిష్టతరమైన స్టంట్ అమరిక

నరసరావుపేట లీగల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డాక్టర్ అంజిరెడ్డి వైద్యశాలలో క్లిష్టతరమైన స్టంట్‌ను అమర్చినట్లు నిర్వాహకులు డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గుండెలో పేరుకుపోయిన క్యాలిషియంను ఓపీ టెక్నాలజీ ద్వారా తీసి పేషేంట్‌కు స్టంట్‌వేసి పునర్జన్మ ప్రసాదించినట్లు తెలిపారు. భారతదేశంలో ఈరకమైన స్టంట్ అమరికలలో ఇది తొమ్మిదవదని, రాష్ట్రంలో రెండవదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శబరి గిరిష్ తదితరుల పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అరవిందబాబుకు ఘన సన్మానం

నరసరావుపేట లీగల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును దీపావళి సందర్భంగా పట్టణంలోని అక్షర నర్సింగ్ హోమ్, రాంప్రసాద్ స్కాన్ సెంటర్ల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు నిలువెత్తు చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో వైద్యులు లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రాంప్రసాద్, విద్యాసాగర్, ప్రకాశం జిల్లా వేటపాలెంకు చెందిన టీడీపీ నేతలు మోహనరావు, రాహుల్, శ్రీనివాసరావు, మూడో వార్డు టీడీపీ నేతలు, పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

వినుకొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని ఏఐటీయూసీ 105 ఆవిర్భావ దినోత్సం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ చేతులు మీదుగా శివయ్య స్థూపం వద్ద ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు.



● నాదెండ్ల: మండలంలోని నాదెండ్ల సమీపంలోని నందికొండ విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద వివిధ మాలధారులకు శనివారం నుంచి డిసెంబరు 14 వరకు మధ్యాహ్నం చద్ది ఏర్పాటు చేస్తున్నట్లు అయ్యప్ప సేవా సమాజం వారు తెలిపారు.

బీసీ కాలనీలో నిలిచిన మురుగు

● హైవే నిర్మాణంతో పూడిపోయిన కాలువలు
● మురుగుమయం అవుతున్న సర్వీస్ రోడ్డు





వర్షం కారణంగా గ్రామంలోని సర్వీస్ రోడ్డు వెంబడి నిలిచిపోయిన మురుగు నీరు

వినుకొండ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): హైవే రాకతో ఆ గ్రామ ప్రజలకు ఆటంకంగా మారింది. హైవే వస్తే తలరాతలు మారతాయని భావించిన ప్రజలకు నిత్యం తిప్పలు తప్పడం లేదు. కాలువలు పూడుకుపోయి వర్షం నీరు ప్రవహించే మార్గాలు మూసుకుపోవడంతో వర్షం వచ్చిన సమయంలో నీరు పెద్దఎత్తున నిలిచిపోయి కాలనీ ప్రజలకు రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. మండలంలోని చీకటీగల పాలెం బీసీ కాలనీలో మురుగునీరు ప్రవహించపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సీసీ డ్రెయిన్‌లోని మురుగునీరు ప్రవహించే పరిస్థితులు కనిపించకపోవడంతో కాలనీ రోడ్లు అన్నీ మూసుకుపోయాయి. గతంకంటే హైవే సర్వీస్ రోడ్డు ఎత్తులో ఉండడంతో ప్రధాన సర్వీస్ రోడ్డు మార్గం మురుగునీరుమయంగా మారింది. పంచాయతీ అధికారులు గతంలో వీధులకు కల్వర్టులు ఏర్పాటుచేసినా నీరు ముందుకు కదలని పరిస్థితి. దీంతో వర్షం వస్తే మురుగునీరంతా సాయిబాబా దేవాలయం వద్ద నిలిచిపోతుండటంతో భక్తులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ అధికారులు సర్వీస్ రోడ్డు పొడవునా మురుగు నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని నాగిరెడ్డిపల్లిలో దీపం-2 పథకం కింద మహిళలకు గ్యాస్ సిలిండర్ అందచేస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జగన్ మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్న ఐదేళ్లలో నిరుపేదల పింఛన్ కేవలం రూ.1000 పెంచితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లో వృద్ధులకు, వితంతువులకు రూ.4000 వేలు, వికలాంగులకు రూ.6000 వేలు పింఛన్ పంపిణీచేసిన చరిత్ర సీఎం చంద్రబాబు నాయుడుకే దక్కిందని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని 23వ వార్డు, మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో తహసీల్దార్ సురేష్ అధ్యక్షతన దీపం -2 పథకం కింద, లబ్ధిదారులకు ఉచిత సిలెండర్ పంపిణీ కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ గ్యాస్ సిలెండర్ అందిన 48గంటల్లో లబ్ధిదారులు చెల్లించిన రూ. 844.50 సొమ్ము బాంక్ ఖాతాల్లో జమచేయడం జరుగుతుందని తెలిపారు. వినుకొండ నియోజకవర్గంలో మొత్తం 22వేల మందికి ఈ పథకం లబ్ధి చేకూరనుందని తెలిపారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్రం ఆర్థికంగా దెబ్బతిన్నదని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ అభివృద్ధితో పాటు, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. అప్పుల రాష్ట్రాన్ని గాడిలో పెట్టి, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, నియోజకవర్గం పరిశీలకులు మానుకొండ శివప్రసాద్. షమీమ్, జనసేన నాయకులు శ్రీనివాసరావులు, మేడమ్ రమేష్, మాదినేని ఆంజనేయులు, ఆయుబ్‌ఖాన్, కౌన్సిలర్లు మార్కెట్ నన్నేసా, చాపలమడుగు ఫైదా, కమీషనర్ సుభాష్ చంద్రబోస్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి

వినుకొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి, జాతీయ ఏక్తా దివస్ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పటేల్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఈవోపీఆర్‌డీ సుందర్‌రెడ్డి మాట్లాడుతూ సర్దార్ వల్లాభాయ్‌పటేల్ 1875లో అక్టోబరు 31 తేదీన గుజరాత్‌లో జన్మించాడని, భారతీయ న్యాయవాదిగా, భారత దేశం హోంమంత్రిగా. ఉక్కు మనిషిగా దేశ స్వాతంత్ర పోరాటంలో కీలకపాత్ర పోషించిన గొప్ప రాజకీయ వాదని అని కొనియాడారు, కార్యక్రమంలో ఏవో రవి, పంచాయితీ సెక్రటరీలు శ్రీనివాసరావు, సచివాలయం పీఎస్‌లు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ 40వ వర్ధంతి, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి కార్యక్రమాలను నియోజకవర్గ కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ నాజ్ సిరాజ్ అధ్యక్షతన ఘనంగా శుక్రవారం నిర్వహించారు. ఇందిరాగాంధీ, వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి గోవిందు శంకర శ్రీనివాసన్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఎం రాధాకృష్ణలు, పార్టీ నాయకులు హాజీ షేక్ సలాం, షేక్ నస్రుద్దీన్, ఇంటూరి భవాని వెంకటేష్, షేక్ నాజ్ సిరాజ్, షేక్ బాజీ పాల్గొన్నారు.

సమాజం సంఘటితంగా ఉంటేనే దేశం పటిష్టం

● కలెక్టర్ అరుణ్‌బాబు



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్, ఎస్పీ

నరసరావుపేట లీగల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సమాజం సంఘటితంగా ఉంటేనే దేశం పటిష్టంగా ఉంటుందని కలెక్టర్ అరుణ్‌బాబు గురువారం తెలిపారు. దేశ మొదటి ఉపప్రధాని, మొదటి హోమ్ శాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురష్కరించుకొని జిల్లా పోలీస్ కార్యాలయంలో రాష్ట్రీయ ఐక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి కలెక్టర్ పీ అరుణ్ బాబు, జాయింట్ కలెక్టర్ గనోరే, ఎస్పీ కే శ్రీనివాసరావులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఐక్యత కోసం పరుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాజరైన అధికారులు, పోలీసులు, విద్యార్థులతో కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాలన అదనపు ఎస్పీ సంతోష్, ఏఆర్ డీఎస్పీ మహాత్మాగాంధీరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. కాగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ ముగింపు కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం ఎస్పీ కార్యాలయ ఆవరణ నుంచి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు, అమరులైన పోలీసుల త్యాగ నిరతికి జోహార్లు అర్పించారు.

ఎమ్మెల్యే జీవీ నివాసంలో దీపావళి సంబరాలు



దీపావళి సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన, మాదినేని

వినుకొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వినుకొండ కొత్తపేటలోని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు నివాసంలో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మండల పార్టీ అధ్యక్షుడు మాదినేని ఆంజనేయులు, పీవీ సురేష్, మస్తాన్‌రావు, టీడీపీ నాయకులతో కలిసి టపాసులు కాల్చి సందడి చేశారు.

మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా పోలూరు ఎంపిక

చిలకలూరిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా పట్టణానికి చెందిన న్యాయవాది పోలూరు పురుషోత్తమరావు ఎంపికయ్యారు. ఈ మేరకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. ఆయన మూడు సంవత్సరాల పాటు ఈ బాధ్యతను నిర్వహిస్తారు.

ఒంటరి మహిళలకు నిత్యావసరాల పంపిణీ

చిలకలూరిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ అసిస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని సుభాని నగర్‌కు చెందిన 114మంది ఒంటరి మహిళలకు రూ.2లక్షల విలువైన బియ్యం, కందిపప్పు, నూనె, గోధుమపిండి తదితర నిత్యావసరాలను శుక్రవారం అందచేశారు. కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ డైరెక్టర్ రంగారావు, ప్రమీల, అసోసియేట్ డైరెక్టర్ కృష్ణ హరీష్, విష్ణుప్రియలు పాల్గొన్నారు.

సర్వర్లు పనిచేయక ఆలస్యంగా పింఛన్ల పంపిణీ

నాదెండ్ల, యడ్లపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలు గ్రామాలలో పింఛన్ల పంపిణీ శనివారం కొద్దిసేపు ఆటంకం కలిగింది. సర్వర్లు పనిచేయకపోవడంతో లబ్ధిదారులు, పంపిణీ సిబ్బంది ఇబ్బందులుపడ్డారు. సర్వర్లు పనిచేయకపోవడంతో సిబ్బంది సచివాలయాలకు చేరుకోగా వారితోపాటే ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులు అక్కడకు చేరుకున్నారు. అయితే ఆ తరువాత సుమారు మధ్యాహ్నం 12గంటల సమయంలో సర్వర్లు పనిచేయడంతో పంపిణీ ప్రారంభించారు. సాయంత్రానికి 90శాతం పింఛన్లు పంపిణీ చేశారు.



దీపం పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ తదితరులు

నరసరావుపేటలో దీపం 2.0 పథకం ప్రారంభం

నరసరావుపేట టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో దీపం 2.0 పదకం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శుక్రవారం ప్రారంభించారు. మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తోందన్నారు. ఈ పథకం అమలుకు ప్రభుత్వం రూ 894 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్, ఆర్డీవో మధులత, నియోజకవర్గ కూటమి నేతలు, మహిళలు పాల్గొన్నారు.

నరసరావుపేటలో పింఛన్ల పంపిణీ

నరసరావుపేట టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలో ఎన్టీఆర్ భరోసా పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. తెల్లవారక ముందే ఇంటి వద్దకే వెళ్ళి పెన్షన్లు ప్రభుత్వ సిబ్బంది అందజేశారు. పెన్షన్ పంపిణీలో భాగంగా పట్టణంలో పలు వార్డులలో పర్యటించి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ పేదల బతుకులలో వెలుగులు నింపే పండుగే పెన్షన్ పంపిణీ కార్యక్రమం అన్నారు. రాష్ట్రంలో 64 లక్షల మందికి పెన్షన్ అందిస్తున్నామని, దేశంలోనే అత్యధిక పెన్షన్ ఇస్తున్న రాష్ట్రం మనదే అన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం అని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవ వేడులకు టీడీపీ కూటమి నేతలతో కలిసి అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్ళు అర్పించారు. అనంతరం పొట్టి శ్రీరాములు సేవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవ కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రం కోసం 58 రోజుల ఆమరణ నిరాహార దీక్ష చేసి అమరులైన పొట్టి శ్రీరాములు తెలుగువారికి చిరస్మరణీయుడు అన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. కాగా ఆంధ్రరాష్ట్ర దినోత్సవ వేడుకలలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని శివుడి బొమ్మ సెంటర్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. పొట్టి శ్రీరాములు జయంతి, వర్ధంతి కార్యక్రమాలను క్రమం తప్పకుండా చేస్తున్న పొట్టి శ్రీరాములు సేవా సమితి అధ్యక్షుడు మిరియాల నరహరి, సెక్రటరీ కట్టమూరి ఆంజనేయులు, కోశాధికారి కొత్తూరు కిషోర్, ఎస్ ప్రకాస్‌రెడ్డిలను అభినందించారు. కార్యక్రమంలో నిడమానూరు సురేంద్ర, కొత్తమాసు మల్లారావు, భవిరిశెట్టి నాగేశ్వరరావు, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: భాస్కర్ థియేటర్ సెంటర్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయా సంఘాల నాయకులు బి శ్రీనునాయక్, కొండ్రముట్ల నాగేశ్వరరావు, తుర్లపాటి వెంకట నగేష్, సలికినీడి నాగరాజు, బి చిన్ననాయక్, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● వినుకొండ: ఆంధ్రరాష్ట్రానికి ఊపిరి పోసిన మహాను భావుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఎమ్మెల్యే జి.వి ఆంజనేయులు కొనియాడారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నరసరావుపేట రోడ్డులోని పెట్రోల్ బంకువద్ద గల అమరజీవి పొట్టిశ్రీములు విగ్రహానికి ఎమ్మెల్యే జి.వి ఆంజనేయులు పూల మాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు ఆయూబ్ ఖాన్, గట్టుపల్లి శ్రీనివాసరావు, పత్తిపూర్ణ, పువ్వాడ కృష్ణ, మెటమర్రి నరసింహారావు, పెనుగొండ శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, బాలరాజు, బత్తుల గోవింద రాజులు, ప్రశాంత్, మేడమ్ రమేష్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల కోసం మెరుగైన బోధన

ఎంఈవో కే పార్వతి





బొల్లాపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బొల్లాపల్లి మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినీ, విద్యార్థులకు మంచి విద్యను అందించేందుకు తన వంతు కృషి చేస్తున్నానని ఎంఈవో కే పార్వతి ఆంధ్రజ్యోతితో తెలిపారు.

ప్రశ్న: 10వ తరగతిలో ఉత్తమ ఫలితాల కోసం ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: బొల్లాపల్లి మండలంలో నాలుగు జిల్లా పరిషత్ పాఠశాలలు, ఒక ఏపీ మోడల్ స్కూల్, ఒక కస్తూర్భా బాలికల విద్యాలయంలో కలసి మొత్తం 422మంది విద్యార్థులు ఉన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి మంచి ఫలితాలు సాధిం చేలా చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర: మధ్యాహ్న భోజనంలో నాణ్యతపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జ: ప్రతిరోజు పాఠశాలలను మానిటరింగ్ చేస్తున్నాం. భోజనంలో నాణ్యత లోపిస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటాం.

ప్ర: పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు సకాలంలో పంపిణీ చేశారా?

జ: విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను కెమిస్ట్రీ-1, కెమిస్ట్రీ-2 సకాలంలో అందజేశాం.

ప్ర: ఉపాధ్యాయుల కొరత ఏమైనా ఉందా?

జ: ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద ప్రభుత్వ ఉత్తర్వులకు లోబడి ఉపాధ్యాయులను భర్తీ చేశాం.

ప్ర: బడి బయట పిల్లలు ఏమైనా ఉన్నారా?

జ: మండలంలో మొత్తం 394మంది బడి బయట పిల్లలు ఉన్నారు. వారిని పాఠశాలలకు వచ్చేలా వారి తల్లిదండ్రులతో మాట్లాడటం, అలాగే బడి బయట పిల్లలను కూడా చదువుపై ఆసక్తి కలిగేలా చైతన్య పరుస్తున్నాం.



యడ్లపాడు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

భాషా సామర్థ్యాలను మెరుగుపరచాలి

● పల్నాడు జిల్లా డీఈవో చంద్రకళ

యడ్లపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషల్లో విద్యార్థులు కనీసం స్వపరిచయం (సెల్ఫ్ ఇంట్రడక్షన్) చేసుకునేలా తీర్చిదిద్దాలని, వారి భాషా పరిజ్ఞానాన్ని మెరుగుపరచేలా చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా డీఈవో చంద్రకళ సూచించారు. శుక్రవారం యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మిక తనిఖీచేశారు. ముందుగా పాఠశాల పరిసరాలను, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం 6,7,8 తరగతుల విద్యార్థుల భాషా, విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టీని పరిశీలించిన డీఈవో దీర్ఘకాలంగా రాని ముగ్గురు విద్యార్థుల గురించి ఆరాతీసి వారు షాపుల్లో పనిచేస్తున్నారని తెలుసుకుని షాపుల వద్దకు వెళ్ళి యజమానులతో మాట్లాడారు. తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడిన డీఈవో పాఠశాలకు పంపించాలని, చదువుకుంటే వారికి మెరుగైన బవిష్యత్తు ఉంటుందని వారికి నచ్చచెప్పారు. మరో పది రోజుల తరువాత పాఠశాలకు వస్తానని డ్రాపౌట్ విద్యార్థులందరూ పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయభారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు సొలస విద్యార్థినులు ఎంపిక



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో హెచ్‌ఎం, వ్యాయామోపాధ్యాయుడు

యడ్లపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మండలంలోని సొలస జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు ఎంపికయినట్లు పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకటకృష్ణమాచారి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి అండర్-14 బాలికల వాలీబాల్ జట్టు ఎంపికలు మంగళగిరి మండలం నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగాయన్నారు. ఈ పోటీలలో 17 నియోజకవర్గాల నుంచి సుమారు 120 మంది విద్యార్థిలు ఈ పోటీలలో పాల్గొన్నారన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గ జట్టు తరఫున పాల్గొన్న పాఠశాలకు చెందిన విద్యార్థినులు వెంగళశెట్టి ఐశ్వర్య, మేరీ సునీతలు అత్యుత్తమ ప్రతిభ కనబరచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 8న విజయనగరం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో జిల్లా జట్టు తరఫున ఆడనున్నట్లు తెలిపారు. జిల్లా జట్టులో స్థానం సంపాదించిన విద్యార్థినులను, వ్యాయామోపాధ్యాయుడు మధుబాబును ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు.

త్రికోటేశ్వరుడిని దర్శించుకున్న తెలంగాణ జూనియర్ జడ్జిలు

నరసరావుపేట కల్చరల్, నవంబరు, 1: తెలంగాణకు చెందిన జూనియర్ సివిల్ న్యాయమూర్తులు శుక్రవారం కోటప్పకొండపై ఉన్న త్రికోటేశ్వరుడిని దర్శించుకున్నారు. దేవరకొండ జూనియర్ సివిల్ న్యాయమూర్తి కేవీఎస్ హరీష్ బాబు, భద్రాచలం సివిల్ న్యాయమూర్తి శివనాయక్, జడ్చర్ల సివిల్ న్యాయమూర్తి ముదాసీర్, గోదావరిఖని సివిల్ న్యాయమూర్తి సచిన్‌రెడ్డి, నిజామాబాద్ సివిల్ న్యాయమూర్తి శ్రీనివాసరావు, కరీంనగర్ సివిల్ న్యాయమూర్తి రాజేశ్వర్‌లు స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. వీరికి ఆలయ అర్చకులు సాదరంగా స్వాగతం పలికి అభిషేక, ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా వీరిలో దేవరకొండ జూనియర్ సివిల్ న్యాయమూర్తి కేవిఎస్ హరీష్ బాబు స్వస్థలం నరసరావుపేట.



వివిధ దేవతా మూర్తుల వేషధారణలో ఉన్న విద్యార్థులు

ఘనంగా కే-రిడ్జ్ పాఠశాలలో దీపావళి వేడుకలు

నరసరావుపేట టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక కే-రిడ్జ్ పాఠశాలలో దీపావళి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు దీపావళి పండుగ విశిష్టతను తెలియజేస్తూ నృత్య, నాటక ప్రదర్శనచేసి తెలియజేశారు. చిన్నారులు అందరూ పాఠశాలను అందంగా దీపాలతో అలంకరించి, టపాసులు కాల్చుకొని తమ ఆనందాన్ని తెలియజేశారు. ప్రిన్సిపాల్ జీ బర్నబాస్, ఏకో-ప్రెడ్లీ దీపావళి పండుగ జరుపుకోవానలి సూచించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజీ, స్కూల్ అకాడమిక్ కో-ఆర్డినేటర్ పుట్ట హేమంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారాన్ని డ్రై డేగా పాటించాలి

● డీఎంఅండ్‌హెచ్‌వో రవి

గణపవరం (నాదెండ్ల), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించడం వలన వ్యాధులు ప్రబలకుండా చూడవచ్చని పల్నాడు జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో రవి అన్నారు. మండలంలోని చందవరం, గణపవరం గ్రామాలలో శుక్రవారం ఆయన జిల్లా మలేరియా అదికారి రవీంద్ర రత్నాకర్‌తో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా మురుగు కాలువల్లోని సిల్టు ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. కాలువలలో దోమల లార్వా ఉన్నట్లు గుర్తించిన ఆయన బ్లీచింగు, ఫాగింగు చేయాలని ఆయా పంచాయతీల సిబ్బందికి సూచించారు. ప్రతి శుక్రవారం నీటి తొట్లను ఎండబెట్టడం ద్వారా, మురుగునీరు నిల్వలను బయటకు పంపడం ద్వారా సీజనల్ వ్యాధులను వ్యాప్తి చెందకుండా చూడాలని సూచించారు. ఆయనతోపాటు స్థానిక వైద్య సిబ్బంది ఉన్నారు.